Postal Reg No:CDP/003/2023-2025

# భారత శక్తి

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:64 కడప, 09-01-2026, శుక్రవారం పేజీలు: 8 వెల: 1.00

## రహదారి నిబంధనలను పాటించాలి


ఎన్టిఆర్ జిల్లా కంచికచర్ల

రహదారి నిబంధనలను పాటించడం ద్వారా విలువైన ప్రాణలను కాపాడుకోవచ్చని నందిగామ ఎసిపి తిలక్ అన్నారు,

రోడ్డు బద్రత మహోత్సో వాలలో బాగంగా కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎసిపి తిలక్ పాల్గొన్నారు. స్వయంగా వాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు భద్రత గురించి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహన దారులుతప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవలన్నారు

## ఏపీ అవినీతి కేసుల్లో సుప్రీంకోర్టు కీలక తీర్పు.. హైకోర్టు ఆదేశం రద్దు!

న్యూఢిల్లీ, జనవరి 8: ఆంధ్రప్రదేశ్‌లో 2016-2020 మధ్య కాలంలో ప్రభుత్వ ఉద్యోగులపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల (డిస్‌ప్రపోర్షనేట్ అసెట్స్) అవినీతి కేసుల్లో సుప్రీంకోర్టు కీలక




తీర్పు ఇచ్చింది. అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన 13 ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది.

ఏపీ విభజన తర్వాత విజయవాడలోని ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్(అఎజ)ను ప్రత్యేక పోలీస్ స్టేషన్‌గా అధికారికంగా నోటిఫై చేయలేదన్న టెక్నికల్ కారణంతో హైకోర్టు ఆ ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన కేసులో హైకోర్టు ఆదేశాన్ని సుప్రీంకోర్టు రద్దు చేస్తూ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించింది.

ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్ వాదనలు వినిపించారు. ఇలాంటి టెక్నికల్ కారణాలతో దేశవ్యాప్తంగా అనేక అవినీతి కేసులు హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ తీర్పు మైలురాయిగా నిలుస్తుంది.

## టీటీడీ పరకామణి కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

అమరావతి, జనవరి 08: పరకామణి కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని.. చట్టప్రకారం ముందుకెళ్లాలని ఏసీబీ డీజీ, సీఐడీకి ఏపీ హైకోర్టు ఆదేశించింది. అలాగే బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టీటీడీ, పోలీసు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. టీటీడీ పరకామణి కేసు విచారణ సందర్భంగా గురువారం నాడు ఏపీ హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

అలాగే నిందితుడు రవికుమార్‌తో కుమ్మక్కై పరకామణి కేసును.. టీటీడీ, పోలీసులు బలహీన పరిచారని పేర్కొంది. నిందితుడు రవికుమార్‌తోపాటు అతడి కుటుంబ సభ్యులకు ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని.. సీఐడీ, ఏసీబీ నివేదికలు పరిశీలిస్తే స్పష్టమవుతుందని తెలిపింది. నిందితుడు రవికుమార్ ఆస్తులు స్వీకరించే క్రమంలో టీటీడీ అధికారులు, బోర్డు సభ్యులు, పోలీసులు చట్ట ప్రకారం నిబంధనలను అనుసరించలేదని ఏపీ హైకోర్టు వెల్లడించింది.

ఇక మాజీ ఏవీఎస్‌వో సతీష్ కుమార్ మృతిపై దర్యాప్తు వేగవంతం చేయాలని సీఐడీని ఆదేశించింది. కేసు తీవ్రత దృష్ట్యా చార్జ్‌షీట్ దాఖలు వరకూ దర్యాప్తును పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది. పరకామణిలో సంస్కరణలపై టీటీడీ సమర్పించిన నివేదికపై హైకోర్టు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేసింది. దేవుడికి సమర్పించిన కానుకల లెక్కింపు విధానం మెరుగు పరిచేందుకు.. అత్యుత్తమ ఆలోచనలతో రావాలని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌కు హైకోర్టు స్పష్టంగా ఆదేశించింది.

తిరుమల శ్రీవారి పరకామణిలో చేపట్టాల్సిన సంస్కరణలపై



నివేదికను ఇటీవల ఏపీ హైకోర్టుకు టీటీడీ సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన ఉత్తర్వులు జారీ చేస్తామని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. పరకామణిలో వెంటనే చేపట్టాల్సిన సంస్కరణలపై ఏపీ హైకోర్టుకు టీటీడీ సోమవారం అంటే.. జనవరి 5వ తేదీన నివేదిక అందజేసింది. ఈ నివేదికను పరిశీలించిన ఏపీ హైకోర్టు గురువారంపై విధంగా స్పందించింది.

## అమరావతిలో భారీ ఎన్టీఆర్ విగ్రహం.. డిజైన్ల పరిశీలన..

అమరావతి, జనవరి 8: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) భారీ విగ్రహం స్మృతివనం ఏర్పాటుకు సంబంధించిన కేబినెట్ సబ్ కమిటీ ఈరోజు (గురువారం) సచివాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి సంబంధించి ఏర్పాటు చేసిన వివిధ నమూనా డిజైన్లను మంత్రులు పరిశీలించారు. విగ్రహంతో పాటు స్మృతివనం ఇతర డిజైన్లనూ ఫైనలైజ్ చేసేందుకు ఈ సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామంలో కొండపై భారీ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ విగ్రహం సుమారు 3500 టన్నుల కంచు తో తయారు చేయనున్నారు. విగ్రహాలకు సంబంధించి ప్రాజెక్టు నివేదిక ప్రాజెక్టు పరిధిని మంత్రి వర్గ ఉపసంఘం సమీక్షించింది. నమూనా విగ్రహం కొలతలు, భంగిమతో సహా విగ్రహ వివరాలపై తుది నిర్ధారణ చేయనున్నట్లు తెలుస్తోంది. విగ్రహం ఏర్పాటును పర్యవేక్షించే బాధ్యతలను అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏజీఐసీఎల్)కు సర్కార్ అప్పగించింది. సబ్ కమిటీ సమావేశంలో డిజైన్లు, స్థలం, నిర్మాణ ప్రణాళికలపై వివరంగా చర్చించినట్లు తెలుస్తోంది.

ఈ సమావేశానికి మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్ హాజరయ్యారు. అలాగే



మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏజీఐసీఎల్) ఎండీ శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. కాగా... ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి రాజధానిని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. త్వరలోనే డిజైన్లు ఖరారు చేసి నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## రాజధానిపై మళ్లీ కుట్రకు తెర తీసిన జగన్

అమరావతి, జనవరి 08: రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ కుట్రలకు తెర తీశారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెడుతున్న సమయంలో వైఎస్ జగన్ కుయుక్తులకు పాల్పడుతున్నారు. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఫ్యాన్ పార్టీ అధినేత విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా నదీగర్భంగా రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నారని జగన్ ఆరోపించారు. దీనిని సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.

రాజధాని అనే పదమే లేదని.. సీఎం ఎక్కడ కూర్చొంటే అదే రాజధాని అంటు ఆయన పునరుద్ఘాటించారు. నదీ గర్భంలో భవన నిర్మాణాలకి అనుమతులివ్వరని.. అలాంటింది రాజధాని నిర్మాణం చేపడుతున్నారంటూ సీఎం చంద్రబాబుపై పరోక్షంగా వ్యాఖ్యానించారు. రహదారులు, నీరు, విద్యుత్ సరఫరా లేని ప్రాంతంలో రాజధాని నిర్మాణం అంటూ వైఎస్ జగన్ వ్యంగ్యంగా అన్నారు. సో కాల్డ్ క్యాపిటల్ అంటూ అమరావతిని ఆయన అభివర్ణించారు.




అమరావతి రాజధానిగా ఉండడం వల్ల తమకేమీ అభ్యంతరం లేదని ఇటీవల వైసీపీ అధినేత వైఎస్ జగన్ రాజకీయ కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత తాజాగా వైఎస్ జగన్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. ఇక రాజధాని అమరావతిపై వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజధానిపై మళ్లీ మాట మారుస్తూ వైఎస్ జగన్ నాలిక మడతేస్తున్నారంటూ విమర్శలు ఊపందుకున్నాయి.

2014లో తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోయింది. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ ఉండిపోయింది. అదే సమయంలో జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైంది. రాజధాని ఏర్పాటు కోసం రాష్ట్రంలోని అనేక ప్రాంతాలను పరిశీలించి.. చివరకు గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గంలో తూళ్లురుతోపాటు 28 గ్రామాల పరిధిలో రాజధాని అమరావతి ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ అసెంబ్లీలో స్వాగతిస్తూ ప్రకటన చేశారు

రాజధాని నిర్మాణానికి ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. రాజధాని నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇంతలో మళ్లీ ఏపీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ఏపీ ఓటరు వైసీపీకి పట్టం కట్టాడు. దాంతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటైంది. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో పరిపాలన వికేంద్రీకరణ జరగాలంటూ.. అందుకు ఏపీకి మూడు రాజధానులు ఉండాలంటూ వైఎస్ జగన్ ఏపీ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ఆ క్రమంలో శాసన రాజధాని అమరావతి, న్యాయ రాజధాని కర్నూలు, పరిపాలన రాజధాని విశాఖపట్నం అంటూ వివరణ ఇచ్చారు.

దీంతో రాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులు ఆందోళనకు దిగారు. తమ విన్నపాలు వినాలంటూ వారు చేసుకున్న విజ్ఞప్తిని సీఎంగా వైఎస్ జగన్ పెడచెవిన పెట్టారు. దాంతో రైతులు నాటి నుంచి ఆందోళనలు, నిరసనలు, దీక్షలు చేపట్టారు. అంతేకాకుండా.. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు, అలాగే అమరావతి నుంచి అరసవల్లి వరకు పాదయాత్ర చేసేందుకు రైతులకు అనుమతి నిరాకరించారు. దాంతో రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో.. ఈ పాదయాత్రలకు అనుమతి లభించింది.

అయినా.. అడుగడుగునా పోలీసుల నిఘా కారణంగా.. రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక మూడు రాజధానుల ప్రాంతంలో ఒక్క ఇటుక వేసి.. నిర్మాణాన్ని సైతం ఈ ప్రభుత్వం చేపట్టలేదు. అలాగే ప్రతిపక్ష పార్టీల నేతలపై అక్రమంగా కేసులు పెట్టి.. జైలుకు తరలించారు. దాంతో జగన్ పాలనపై సర్వత్రా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇంతలో ఎన్నికలు రానే వచ్చాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా పోటీ చేశాయి.

ఈ ఎన్నికల ఫలితాల్లో కూటమికి 164 సీట్లు వచ్చాయి. వైసీపీకి కేవలం 11 సీట్లకు పరిమితమైంది. ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా సైతం దక్కక పోవడం గమనార్హం. 2024లో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దాంతో ఏపీకి ఏకైక రాజధాని అమరావతి అని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజధాని అమరావతి పనులు వేగం పుంజుకున్నాయి. అలాంటి వేళ.. విజయవాడ, గుంటూరు మధ్య ఏపీ రాజధాని ఉండాలని అభిప్రాయపడ్డారు. కాగా, నిమిషానికో మాట మారుస్తున్న జగన్ తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

## వైసీపీకి ధీటుగా బదులివ్వండి.. మంత్రులకు లోకేష్ కీలక సూచనలు

అమరావతి, జనవరి 8: వైసీపీలా రప్పారప్పా విధానం తమది కాదని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. గురువారం ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో టీడీపీ మంత్రులతో మంత్రి లోకేష్ అల్పాహార విందు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి పలు కీలక సూచనలు చేశారు. జగన్‌లా ప్రజల్ని భయపెట్టడం, బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటివి టీడీపీ సంస్కృతి కాదని స్పష్టం చేశారు.

ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ఎంత మేర సేవ చేశామన్నదే మన అజెండా కావాలని తెలిపారు. అభివృద్ధి - సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూర్చామన్నదే కూటమి ప్రభుత్వ విధానమని తేల్చిచెప్పారు. వైసిపి కుట్రలను పార్లమెంట్ వారీగా నేతలు సమర్థంగా తిప్పికొట్టాలని, పార్లమెంట్ కేంద్రాల్లో నేతలు ఏకతాటిపైకి వచ్చి వైసీపీ అసత్య ప్రచారాలకు ధీటుగా బదులివ్వాలని మంత్రి సూచించారు.

మంత్రులు ప్రజావేదికలో తమకు వచ్చే ఫిర్యాదులు పరిష్కారమయ్యేలా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. తమ తమ



శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి మంత్రులు చొరవ చూపాలని ఆదేశించారు. పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇన్‌ఛార్జి మంత్రులు పనిచేయాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

## చట్టాలు రాతిపై చెక్కిన శిల్పాలు కావు.. ఎంపీ షాకింగ్ కామెంట్స్..

రాజమండ్రి, జనవరి8 ( కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' )పై బీజేపీ రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు. విబ్ జీ రామ్ జీ పథకంపై ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. చట్టాలు రాతిపై చెక్కిన శిల్పాలు కావని అందరూ గుర్తించాలని పేర్కొన్నారు. రాజ్యాంగంలో కూడా అనేక సవరణలు చేసుకున్నామని ప్రస్తావించారు. ఇవాళ (గురువారం) రాజమండ్రిలో పురందేశ్వరి పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు పురందేశ్వరి.



# భారత్ తప్పటడుగులు వేసిందా

నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత నెల రోజుల నుంచి షేక్ హసీనాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో ప్రజలు వీధుల్లోకి వచ్చి పోరాటం మొదలుపెట్టారు. ఈ నిరసనలు ఆగస్టు 5న తీవ్ర హింసాత్మకంగా మారాయి. షేక్ హసీనా తన ప్రాణాలను కాపాడుకోవడానికి భారత్‌కు రావాల్సి వచ్చింది. బంగ్లాదేశ్‌లో నిరంకుశ పాలనను కొనసాగించారని ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడిగా పేరున్న హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్‌కు, భారత్‌తో చారిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. షేక్ హసీనా, భారత్ మధ్య సంబంధాలు కూడా అదే విధంగా కొనసాగాయి. అయితే, భారత్ మద్దతుతోనే షేక్ హసీనా అధికారంలో ఉన్నారని బంగ్లాదేశ్‌లోని ప్రతిపక్షాలు, షేక్ హసీనా వ్యతిరేకులు ఆరోపిస్తూ వచ్చారు. గతేడాది ఆగస్టులో షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన తర్వాత బంగ్లాదేశ్‌లో యాంటీ-ఇండియా సెంటిమెంట్ మరింత పెరిగింది. బంగ్లాదేశ్‌ను భారత్ ఎప్పుడూ షేక్ హసీనా కుటుంబ దృష్టితోనే చూస్తోందని, అంతకు మించి చూసేందుకు ఎప్పుడూ ప్రయత్నించలేదని బంగ్లాదేశ్ మీడియా అంటోంది. ఈ నెల డిసెంబర్ 23న బ్రస్సెల్స్‌కు చెందిన లాభాపేక్ష లేని పరిశోధనా సంస్థ ఇంటర్నేషనల్ క్రైసిస్ గ్రూప్ (ఐసీజీ) భారత్-బంగ్లాదేశ్ సంబంధాలపై 'ఆఫ్టర్ ది "గోల్డెన్ ఎరా": గెటింగ్ బంగ్లాదేశ్-ఇండియా టైస్ బ్యాక్ ఆన్ ట్రాక్ అనే పేరుతో 53 పేజీల రీసర్చ్ రిపోర్టును ప్రచురించింది. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా షేక్ హసీనా తన పదవిని కోల్పోవడం భారత్‌కు తీవ్ర ఎదురు దెబ్బ అని ఈ నివేదికలో పేర్కొంది. బంగ్లాదేశ్-భారత్ సంబంధాలపై ఐసీజీ తాజాగా విడుదల చేసిన నివేదికలో.. విలియం వ్యాన్ షెండెల్ పుస్తకం 'ఏ హిస్టరీ ఆఫ్ బంగ్లాదేశ్' లోని కోట్‌ను కూడా చేర్చింది. 'ఏ హిస్టరీ ఆఫ్ బంగ్లాదేశ్' పుస్తకంలో విలియం వ్యాన్ షెండెల్ రాసిన వివరాల్లో, " బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి భారత్ మద్దతు ఇచ్చినప్పటికీ, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు శత్రుత్వంలా కాకపోయినా, తరచూ ఉద్రిక్తంగానే ఉండేవి. బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడంలో ఒకరి పాత్రను మరొకరు తక్కువ చేసుకునే కథనాలను రెండు దేశాలు ప్రోత్సహించేవి" అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో న్యూఢిల్లీ సహకారానికి తగినంత కృతజ్ఞతను బంగ్లాదేశ్ చూపించలేదని భారత్‌లో ఒక దృక్పథం ఉంది. అలాగే, భారత్ కేవలం తన సొంత వ్యూహాత్మక ప్రయోజనాలకు మాత్రమే జోక్యం చేసుకుంటుందని.. స్వతంత్ర బంగ్లాదేశ్‌ను ఒక శాటిలైట్ స్టేట్‌గా (మరోదేశం నియంత్రణలో, అత్యధిక రాజకీయ ప్రాబల్యంతో నడిచే దేశంగా) భావించి, ఏహ్య భావంతో చూస్తుందని ఆ దేశ ప్రజలు విస్తృతంగా భావిస్తున్నారు" అని రాశారు. భారత విదేశాంగ వ్యవహారాల జర్నల్‌లో స్మృతి ఎస్. పట్నాయక్ రాసిన ఆర్టికల్‌ను కూడా ఈ నివేదిక కోట్ చేసింది. "షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్‌కు భారత్ ఇచ్చిన స్థిరమైన మద్దతు ద్వారానే ఎన్నో సంవత్సరాలుగా భారత్, బంగ్లాదేశ్ సంబంధాల మధ్య పునాది బలపడిందని పునరుద్ఘాటించడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ప్రస్తుతం ఈ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. రెండు దేశాల మధ్య పునాది కూడా తీవ్రంగా దెబ్బతిన్నది" అని డైలీ స్టార్ రాసింది. ఈ దెబ్బతిన్న ప్రాంతంలో ఉన్న ఖాళీని పరస్పర అనుమానం పూరిస్తోంది. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతూ, పారిపోయిన వారికి న్యూఢిల్లీ సురక్షితమైన ప్రదేశంగా మారిందని ఢాకా భావిస్తోంది. అలాగే, బంగ్లాదేశ్‌లో మెజారిటీ వర్గాల అరాచకం పెరుగుతోందని భారత్ ఆందోళన చెందుతోంది. జియా-ఉర్-రెహమాన్, ఖలీదా జియాలు భారత్ ప్రయోజనాలు దెబ్బతీస్తుండటంతో, భారత్ తప్పనిసరి పరిస్థితుల్లో షేక్ హసీనాకు మద్దతు ఇవ్వాల్సి వచ్చిందని దిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలోని సౌత్ ఏషియన్ స్టడీస్ సెంటర్ ప్రొఫెసర్ మహేంద్ర పీ లామా భావిస్తున్నారు. "తూర్పు పాకిస్తాన్ కారణంగా భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలతో దాదాపు సంబంధాలు తెగిపోయాయి. అప్పుడు, బంగ్లాదేశ్ ఏర్పాటు ఒక ఆశను తీసుకొచ్చింది. షేక్ ముజిబుర్ రెహమాన్, షేక్ హసీనా పదవీ కాలాల్లో ఈ ఆశ సజీవంగా మిగిలింది. అయితే, బంగ్లాదేశ్‌లోని జియా-ఉర్-రెహమాన్, హుస్సేన్ మొహమ్మద్ ఇర్షాద్‌లు భారత ప్రయోజనాలను దెబ్బతీశారు. అలాంటి పరిస్థితుల్లో షేక్ హసీనా, అవామీ లీగ్‌ను భారత్ బలపర్చాల్సి వచ్చింది" అని ప్రొఫెసర్ లామా చెప్పారు. 1975 ఆగస్టులో బంగ్లాదేశ్ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు షేక్ ముజిబుర్ రెహమాన్‌తో పాటు చాలామంది తన కుటుంబ సభ్యులు సైనిక తిరుగుబాటులో హత్యకు గురయ్యారు. ఈ ఘటన రెండు దేశాలకు టర్నింగ్ పాయింట్ అయింది. ఈ హత్యలు బంగ్లాదేశ్‌లో సైనిక పాలనకు దారితీశాయి. ముఖ్యంగా, 1976 నుంచి 1981 వరకు జియా-ఉర్-రెహమాన్ పాలనలో (ఆ తర్వాత సైన్యంలోని సభ్యులే జియా-ఉర్-రెహమాన్‌ను హత్య చేశారు), ఆ తర్వాత 1982 నుంచి 1990 మధ్య కాలంలో హుస్సేన్ మొహమ్మద్ ఇర్షాద్ పాలనలో బంగ్లాదేశ్ నడిచింది" అని ఐసీజీ తన నివేదికలో పేర్కొంది. ఢాకాలో 15 ఏళ్ల సైనిక పాలన కాలంలో.. భారత్-బంగ్లాదేశ్‌లు ఒకదానికొకటి ప్రధానంగా భద్రతా కోణంలోనే చూసుకునేవి. ఇరు దేశాలు తమ భూభాగాల్లో పనిచేసే తిరుగుబాటు గ్రూప్‌లకు మద్దతు ఇచ్చాయి. బంగ్లాదేశ్ చిట్టగాంగ్ కొండ ప్రాంతాల్లో (చిట్టగాంగ్ హిల్ ట్రాక్ట్స్) శాంతి బాహిని సంస్థకు న్యూఢిల్లీ మద్దతు ఇచ్చేది" అని ఐసీజీ రాసింది. ఈశాన్య భారత్‌లో ఆపరేట్ అయ్యే తిరుగుబాటుదారులకు ఆయుధాలను సరఫరా చేస్తూ ఢాకా సాయం చేసింది. బంగ్లాదేశీ గడ్డపై క్యాంపులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి కూడా ఇచ్చింది. 1980లలో, బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలు భారత్‌లో రాజకీయ సమస్యగా మారాయి. దీనికి స్పందనగా, సరిహద్దుల్లో న్యూఢిల్లీ కంచెలు వేసింది. సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేసింది" అని పేర్కొంది. 1990-91లో బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పాలన తిరిగి రావడంతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడొచ్చన్న ఆశలు భారత్‌లో కలిగాయి. కానీ, బంగ్లాదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం బీఎన్‌పీ నేతృత్వంలో ఏర్పడింది. ప్రధానమంత్రి ఖలీదా జియా 1992లో భారత్‌ను సందర్శించడం, రెండు దేశాల మధ్య సరికొత్త వాణిజ్య ఒప్పందంవంటి సానుకూల సంకేతాలు ప్రారంభంలో ఉన్నప్పటికీ, ఆ తర్వాత సంబంధాల మెరుగుదల ఆశలు నీరుగారిపోయాయి. తిరుగుబాటుదారులకు బంగ్లాదేశ్ మద్దతు ఇస్తోందని భారత అధికారులు ఆరోపించారు. నీళ్ల పంపిణీ, సరిహద్దు విభజన వంటి కీలక ద్వైపాక్షిక విషయాల్లో కొంత పురోగతి కనిపించింది. బీఎన్‌పీ ప్రభుత్వానికి జమాత్ ఏ ఇస్లామీ మద్దతు ఇస్తోందని భారత్ ఆరోపించిన తర్వాత ఈ అపనమ్మకం మరింత పెరిగింది. హిందూ జాతీయవాద భారతీయ జనతా పార్టీ ప్రభావం పెరగడం, 1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదు కూల్చడం వంటివి బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక భావనను మరింత పెంచాయి. బాబ్రీ మసీదు కూల్చిన తర్వాత, బంగ్లాదేశ్‌లో హిందూ కమ్యూనిటీకి చెందిన వారిపై దాడులు జరిగాయి. భారత్‌లో హిందూ-ముస్లింల మధ్య మత ఘర్షణలు జరిగాయి. భారత దేశీయ రాజకీయాల్లో ముస్లింల పట్ల ద్వేష రాజకీయాలు ఉంటే అది బంగ్లాదేశ్‌ను కూడా ప్రభావితం చేస్తుందని, అక్కడ ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని ఆశించలేమని ప్రొఫెసర్ లామా అన్నారు. 16 నెలలుగా భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు స్తంభించిపోయాయి. గత 10 రోజులుగా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. భద్రతా కారణాలతో, భారత్‌లో దిల్లీ సహా నాలుగు ప్రాంతాల్లో వీసా సర్వీసులను ఢాకా నిలిపివేసింది. అలాగే, భారత్ కూడా ఢాకాతో సహా నాలుగు ప్రాంతాల్లో వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఢాకా, దిల్లీ మధ్యలో ఇంత అపనమ్మకం, అనుమానాన్ని నేనెప్పుడూ చూడలేదు. అంతర్జాతీయ నిబంధనలు ప్రకారం, ఇరుదేశాలు దౌత్య కార్యాలయాలకు భద్రత కల్పించాలి. రెండు పొరుగుదేశాలు, ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నందున భారత్ వాస్తవాన్ని అంగీకరించి, బంగ్లాదేశ్‌తో ఉన్న సంబంధాల విషయంలో నమ్మకాన్ని పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉంది.

# మున్సిపల్ ఎన్నికలకు ఇంకా ఆలస్యం...

విజయవాడ, జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)

తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలకు అంతా రెడీ అవుతోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు కసరత్తు జరుగుతోంది. ఇదే టైమ్‌లో ఏపీలో కూడా లోకల్ బాడీ, మున్సిపల్ ఎలక్షన్స్‌కు వేగంగా అడుగులు పడ్డాయి. ఈ జనవరిలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు స్టేట్ ఈజీ సిద్ధమైంది. వార్డుల విభజన, ఓటర్ల జాబితా తయారీ స్పీడప్ చేసింది. కూటమి పార్టీలు కూడా ఎన్నికల వ్యూహాల్లో బిజీగా అయిపోయాయి. కట్ చేస్తే ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు, మున్సిపల్ పోల్స్ ఇప్పట్లో జరిగే పరిస్థితి లేదన్న టాక్ బయలుదేరింది. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగుస్తుంది. మార్చిలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. కానీ అంతలోపే జనగణన స్టార్ట్ అవుతుంది. దీంతో పంచాయితీల విలీనం, విభజన.. సేమ్‌టైమ్ మున్సిపాలిటీల విలీనం, విభజనకు అవకాశం లేకుండా పోతోంది. దీంతో ఏపీలో మున్సిపల్ ఎన్నికలు ఆలస్యం అవుతాయని అంటున్నారు. లేటెస్ట్ డెవలప్‌మెంట్ ప్రకారం జనగణన తర్వాతే ఏపీలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందట. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కూడా మున్సిపల్ ఎన్నికలపై స్పష్టత ఇచ్చేశారు. ఈ ఏడాది కేంద్రం జనగణన నిర్వహిస్తోంది. ఈ ప్రాసెస్ అంతా పూర్తి కావడానికి కనీసం ఆరు ఏడు నెలలు పడుతుందట. జనగణన మొత్తం పూర్తి అయి.. ఓ క్లారిటీ రావాలంటే ఏడాది సమయం పక్కా పడుతుందని..2026 డిసెంబర్ వరకు జనగణన మొత్తం పూర్తవుతుందని భావిస్తున్నారట. దాంతో జనగణన కంప్లీట్ అయ్యాకే ఆ వివరాలు అన్నీ చూసుకుని కొత్త డేటా ప్రకారం ఎన్నికలు పెట్టాలనేది కూటమి ప్రభుత్వం ఆలోచనగా చెబుతున్నారు. 2027 స్టార్టింగ్‌లో లోకల్ బాడీస్, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉందట ఏపీ సర్కార్. ప్రస్తుతం



ప్రభుత్వం దగ్గర 2011 జనాభా లెక్కల వివరాలే ఉన్నాయి. ఆ తర్వాత అయితే 2021లో కరోనా కారణంగా జనగణన జరగలేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం జనగణనను చేయాలని డిసైడ్ అయింది. దీంతో ఏపీలో ఎన్నికలు వాయిదా పడతాయని అంటున్నారు. కొత్త లెక్కలతో సామాజిక సమీకరణలు కూడా చూసుకుని పూర్తి సమాచారంతో అన్ని వర్గాలకు న్యాయం చేసేలా రిజర్వేషన్ కూర్పు చేస్తారని చర్చ జరుగుతోంది. ఇక మార్చితో మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పాలక వర్గం గడువు ముగుస్తుంది. దాంతో పాలక మండళ్లు రద్దు అవుతాయి. అయితే తొమ్మిది నెలల నుంచి ఏడాది దాకా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలోనే లోకల్ బాడీస్ పాలన సాగుతుందని అంటున్నారు. ఇక విజయవాడని గ్రేటర్‌గా మార్చాలనే ప్రతిపాదన ఉందట. తిరుపతి కార్పొరేషన్‌ను కూడా గ్రేటర్‌గా చేసే ఆలోచన ఉందంటున్నారు. ఈ డిమాండ్లపై కూడా జనగణన లెక్కలు వచ్చాక.. 2027లోనే ఓ అంచనాకు వస్తారని అంటున్నారు. ఫైనల్‌గా ఈ ఏడాదిలో మున్సిపల్ ఎన్నికలు అయితే ఉండవంటున్నారు. దాంతో ఇటు కూటమి పార్టీలకు..ఇటు వైసీపీకి స్థానిక వ్యూహాలు రచించేందుకు ఇంకో ఏడాది టైమ్ దొరికినట్లు అయింది.

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జనగణన తరువాత ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. దీంతో ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఏడాది జరిగే అవకాశం లేదని ప్రచారం మొదలైంది. 2027 ప్రథమార్థంలో జరుగుతాయని టాక్ నడుస్తోంది. కొద్దిరోజుల కిందట రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నీలం సాహ్ని స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభించారు. కానీ ఇప్పుడు జనగణన తెరపైకి రావడంతో.. అది పూర్తయిన తర్వాతే ఎన్నికలు అని స్పష్టమవుతోంది.

– 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ముందుగా పంచాయితీ ఎన్నికలు జరగగా.. తరువాత మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. చివరిగా మండల, జిల్లా ప్రాదేశికాలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించారు.

–పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ఫిబ్రవరితో గడువు ముగియనుంది. అయితే ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించి.. తరువాత మిగతా ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తోంది ప్రభుత్వం.

– మార్చి వరకు మున్సిపాలిటీలతోపాటు కార్పొరేషన్లకు గడువు ఉంది. జిల్లా పరిషత్తులకు అయితే జూన్ వరకు గడువు ఉంది.× ఏప్రిల్ నుంచి జనగణన ప్రారంభం కానుంది. అది కొలిక్కి రావాలంటే ఈ ఏడాది డిసెంబర్ పడుతుంది. అందుకే కొత్త జనాభా లెక్కల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి అనుకుంటే 2027 వరకు ఆగాల్సిందే.

– ప్రస్తుత జనాభా లెక్కలు 2011 వరకు మాత్రమే ఉన్నాయి.. ప్రతి పది సంవత్సరాలకు జరగాల్సిన జనగణన 2021లో కరోనా కారణంగా జరగలేదు. అందుకే ఇప్పుడు జనగణన పూర్తి చేసే పనిలో ఉంది కేంద్ర ప్రభుత్వం. ఒకవేళ పాత జనాభా లెక్కల ప్రకారం ఎన్నికలకు నిర్వహించాలి అంటే ముందుగా పంచాయతీలను పూర్తి చేస్తారు.

– అయితే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్ర ఆర్థిక సంఘం నిధులతో పాటు ప్రత్యేక నిధులు వర్తించవు. అదే జరిగితే గ్రామాల్లో మౌలిక వసతులు నిలిచిపోతాయి. అది ప్రభుత్వానికి ఇబ్బంది కరం. అందుకే ఎంత మాత్రం ఎన్నికలు నిర్వహించేందుకే ప్రభుత్వం మొగ్గు చూపుతోందని తెలుస్తోంది.

==============================

# కేతిరెడ్డి ఆన్ ఫైర్...

అనంతపురం, జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)

ధర్మవరం రాజకీయం మరింత వేడెక్కనుంది. త్వరలోనే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే మళ్లీ గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని కేతిరెడ్డి మొదలుపెట్టనున్నారు. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి ధర్మవరంలో ఆయన తన పట్టును నిలుపుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై గతంలో అధికారలో ఉన్నప్పుడు కబ్జా ఆరోపణలు చేసినప్పటికీ వాటిని అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో నిరూపించలేకపోయారని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అంటున్నారు. నిజానికి గత ఎన్నికల్లో తన ఓటమిని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తట్టుకోలేకపోయారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి అవసరాలు, సమస్యలను వెంటనే పరిష్కరించే తనను ఓడించారంటే తాను ఇప్పటికీ నమ్మలేకపోతున్నానంటున్నారు.

అందుకే పార్టీ అధికారంలో కోల్పోయిన తర్వాత కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఒకానొక దశలో వైసీపీ అధినేత జగన్ పై విమర్శలు చేయడానికి కూడా వెనుకాడలేదు. మద్యం విషయంలో తమ ప్రభుత్వం విఫలమయిందన్నారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు కూడా తమకు అవకాశం లేదని చెప్పారు. సీఎంవోలో ధనుంజయ్ రెడ్డి వ్యవహార శైలిపై కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి నాడు ధ్వజమెత్తారు. తాను ఉన్నది ఉన్నట్లు మాట్లాడతానని, తాను వైసీపీలోనే కొనసాగుతానని తర్వాత కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి వివరణ ఇచ్చారు. జగన్ కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలను మర్చిపోవడం,



వాలంటీర్లనే సర్వస్వంగా భావించడం ఈ దుస్థితికికారణమని కూడా కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. అలాంటి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తిరిగి యాక్టివ్ అవుతున్నారు. కేతిరెడ్డి ఒకసారి కాంగ్రెస్ నుంచి మరొక సారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. రెండు సార్లు ఓటమి పాలయ్యారు. అయితే 2024 ఎన్నికల్లో ఓటమికి తాను కారణం కాదన్న ధోరణి ఆయనలో స్పష్టంగా ఇప్పటికీ కనిపిస్తుంది. తన నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధితో పాటు ప్రజలతో తాను మమేకమైన తీరు ఓటమి అసాధ్యమన్న భావనలోనే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఉన్నారు. అందుకే మరొకసారి గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికలకు మూడేళ్ల ముందే ధర్మవరంలో తిరిగి గెలుపొంది తనపై వచ్చిన విమర్శలకు చెక్ పెట్టాలన్న యోచనలో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఉన్నట్లు కనపడుతుంది.

# హైవేల నిర్మాణంలో 2 గిన్నిస్ రికార్డులు

కర్నూలు, జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)

ఏపీలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి రెండు గిన్నిస్ వరడల్డ్ రికార్డులు నమోదయ్యాయి. ఈ విషయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు. భారత జాతీయ రహదారుల సంస్థ, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన ఘనతను సాధించింది. బెంగళూరు- కడప- విజయవాడ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో భాగంగా, కేవలం 24 గంటల వ్యవధిలో నిరంతరాయంగా 28.95 లేన్-కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించి, 10,675 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీటును వేయడం ద్వారా రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సృష్టించింది. ప్రపంచస్థాయి రహదారి మౌలిక సదుపాయాలను నిర్మించాలనే భారత ప్రభుత్వ సంకల్పానికి మరియు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మార్గదర్శకత్వానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. ఈ అసాధారణ విజయం ఇంజనీర్లు, కార్మికులు మరియు ఫీల్డ్ టీమ్‌ల అంకితభావంతో సాధ్యమైందని చంద్రబాబు అన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ నిర్దేశించిన అత్యంత కఠినమైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూనే ఈ రికార్డును నెలకొల్పడం విశేషం. ఇదే ఉత్సాహంతో జనవరి 11, 2026 నాటికి ఈ ప్రతిష్టాత్మక కారిడార్‌లోని ప్యాకేజీ 2, 3లలో మరో రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించేందుకు బృందం సిద్ధమవుతోంది. భారతదేశం నిర్మిస్తోంది.. ఆంధ్రప్రదేశ్ అందిస్తోంది అనే నినాదానికి ఈ ప్రాజెక్ట్ ఒక నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు.

# అచ్చెన్నకు షాక్....

విజయవాడ, జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ మంత్రి అచ్చెన్నాయుడుకు పార్టీ నాయకత్వం షాక్ ఇచ్చింది. ఆఫ్కాఫ్ ఛైర్మన్ రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ మత్స్యకారుల ఫెడరేషన్ ఛైర్మన్ ఎన్నికలను మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రలు సీరియస్ గా తీసుకున్నారు. అచ్చెన్నాయుడు కర్నూలు జిల్లాకు చెందిన నవీన్ పేరును ప్రతిపాదించారు. కొల్లు రవీంద్ర రాంప్రసాద్ కు మద్దతిచ్చారు. అయితే ఇరు వర్గాలు క్యాంప్ లను నిర్వహించడంతో పార్టీ నాయకత్వం దృష్టికి వచ్చింది. దీంతో తాము సూచించిన వారు మాత్రమే నామినేషన్ వేయాలని పార్టీ హైకమాండ్ సూచించింది. చివరకు ఆఫ్కాఫ్ ఛైర్మన్ గా రాంప్రసాద్ పేరును అధినాయకత్వం సూచించింది. దీంతో ఆయన ఒక్కరే నామినేషన్ వేశారు. రాంప్రసాద్ కడప జిల్లాకు చెందిన వారు. దీంతో అచ్చెన్నాయుడు మద్దతిచ్చిన నవీన్ నామినేషన్ వేయలేదు. పార్టీ హైకమాండ్ కొల్లు రవీంద్ర వైపు మొగ్గు చూపినట్లయింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మంత్రి వర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు చేసినట్లు సమాచారం. అయితే ఇందులో కీలకమైన విషయం ఏంటంటే మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడును కేబినెట్ నుంచి తప్పించాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. ఈ మేరకు పార్టీ వర్గాల్లో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. అయితే అదే సమయంలో అచ్చెన్నాయుడుకు కీలకమైన పదవి ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. అదీ పార్టీ పరంగా పదవి ఇచ్చేందుకు సిద్ధమయినట్లు తెలిసింది. అచ్చెన్నాయుడును రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా చేయాలని చంద్రబాబు దాదాపుగా నిర్ణయించినట్లు తెలిసింది. అచ్చెన్నాయుడు సీనియర్ నేత. కొన్ని దశాబ్దాల నుంచి కింజారపు కుటుంబానికి టీడీపీతో అనుబంధం ఉంది. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, లేనప్పటికీ ఆ కుటుంబం వేరే పార్టీ వైపు చూడలేదు. శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే కాకుండా ఉత్తరాంధ్రలోనూ టీడీపీకి మంచి పట్టున్న ఫ్యామిలీగా కింజారపు కుటుంబానికి పేరుంది. ఇప్పటికీ కేంద్రమంత్రివర్గంలో ఉన్న రామ్మోహన్ నాయుడుపై చంద్రబాబుకు కాని, లోకేశ్ కు కాని సదాభిప్రాయం ఉంది. ముఖ్యంగా లోకేశ్ కు రామ్మోహన్ నాయుడు సన్నిహితుడు కావడంతో పాటు ఎర్రన్నాయుడు కుమారుడిగా ఆయనకు కేంద్ర మంత్రి పదవి దక్కింది. రామ్మోహన్ నాయుడు ఎప్పుడూ జిల్లా రాజకీయాల్లో కానీ, ఇతర విషయాల్లోనూ జోక్యం చేసుకోరన్న పేరుంది. కానీ అచ్చెన్నాయుడు మాత్రం ఈ దఫా అనేక నియోజకవర్గాల్లో వేలు పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివాదాలు కూడా చంద్రబాబుకు తలనొప్పిని తెచ్చిపెడుతున్నాయంటున్నారు. ఆప్కాఫ్ ఛైర్మన్ పదవి విషయంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రల మధ్య వివాదం కూడా ఈ నిర్ణయానికి కారణమంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడిని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిని చేస్తే సామాజికవర్గం పరంగా బీసీలకు ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందని, ప్రస్తుత అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలున్నాయంటున్నారు. దానివల్ల అచ్చెన్నాయుడుకు కీలకమైన పదవి ఇచ్చినట్లవుతుందని చంద్రబాబు



భావిస్తున్నారంటున్నారు. అదే సమయంలో భారీగా మంత్రివర్గంలో మార్పులు చేయాలని కూడా చంద్రబాబు నాయుడు భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో పెద్దయెత్తున చర్చ జరుగుతుంది. ఎవరు ఇన్ ? ఎవరు అవుట్ ? అన్నది ఇంకా క్లారిటీ రాకపోయినా విస్తరణలో మాత్రం అచ్చెన్నను కేబినెట్ నుంచి తొలగించి పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించినట్లు సమాచారం. మరి చంద్రబాబు నాయుడు నిర్ణయంపై మరికొద్ది రోజుల్లోనే స్పష్టత రానుంది.

# ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ

నెల్లూరు, జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)

నెల్లూరు జిల్లా ఉదయగిరి టీడీపీలో అంతర్గత విభేదాలు పీక్ లెవల్‌కు చేరాయి. ఎమ్మెల్యే కాకర్ల సురేష్..మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఎన్నికలప్పటి నుంచే ఉప్పు-నిప్పుగా ఉంటున్నారట. తనను బద్నామ్ చేయాలన్నదే బొల్లినేని టార్గెట్ అంటూ ఎమ్మెల్యే రగిలిపోతున్నారు.అవకాశం దొరికితే అడ్డంగా బుక్ చేసి తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాసుకొని కూర్చున్నారని మండిపడుతున్నారు. గత ఎన్నికల్లో తనకు టికెట్ రాకుండా కుట్ర చేసిన నేతతో కలిసి బొల్లినేని..కొత్త జమ్మిక్కులకు తెరలేపారన్నది ఎమ్మెల్యే అలిగేషన్. అయితే ఇలాంటి వెన్నుపోటు రాజకీయాలకు భయపడేది లేదంటూ గట్టి రియాక్ట్ అవుతున్నారు ఎమ్మెల్యే.కుట్రలు చేస్తున్నదెవరైనా దూల తీరుస్తానంటూ వార్నింగ్‌లు ఇస్తున్నారు. మీ జాతకాలు తీసుకెళ్లి అధిష్టానం దగ్గర పెడతానంటూ హెచ్చరిస్తున్నారు. ఇలా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పొలిటికల్ ఫైట్ నడుస్తుండగానే..రీసెంట్‌గా ఈ ఎపిసోడ్‌లోకి ఓ లేడీ ఎంట్రీ ఇవ్వడం మరింత హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఇటు ఎమ్మెల్యే..ఇటు మాజీ ఎమ్మెల్యే..మధ్యలో లేడీ అన్నట్లుగా ఆసక్తికరంగా మారింది ఇష్యూ.గత ఎన్నికల్లో బొల్లినేని రామారావు ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడగా.. టికెట్ తెచ్చుకున్న కాకర్ల సురేష్ ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, బొల్లినేని రామారావు మధ్య అంతర్గతంగా గ్యాప్ నడుస్తూనే ఉందట. ఏదో ఒక ఘటనతో ఇద్దరి మధ్య అంతర్గత విభేదాలు అప్పుడప్పుడు బయటపడుతూనే ఉన్నాయట.ఇటీవల ఉదయగిరి నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులను ఇతర ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లకు అప్పగించారు ఎమ్మెల్యే. ఆ కాంట్రాక్టర్లను బొల్లినేని రామారావు వర్గం బెదిరించిందనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల అభివృద్ధిని అడ్డుకుంటే..తాటతీస్తా..! తొక్కుకుంటూ వెళ్తా..అంటూ..ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కామెంట్స్ చేశారట.బొల్లినేని రామారావును ఉద్దేశించే ఎమ్మెల్యేలా ఇలా మాట్లాడారన్న చర్చ ఉండనే ఉంది. అంతేకాదు గత ఎన్నికల్లో తనకు టికెట్ రాకుండా వ్యతిరేకంగా పనిచేసిన బొబ్బూరు వెంగళరావును..బొల్లినేని దగ్గర చేర్చుకుని కుట్రలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు ఎమ్మెల్యే.అయితే ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య విభేదాలు రచ్చకెక్కి చర్చకు దారితీస్తున్న వేళ..ఈ ఎపిసోడ్‌లోకి వెంగమాంబ అనే మహిళ ఎంట్రీ ఇచ్చింది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై ఆమె ఆరోపణలు చేసిన వీడియో వైరల్ అయింది. కాకర్ల సురేష్‌ను సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పించుమని అడిగితే..నీకు ఉద్యోగం కంటే రాజకీయాలే బాగా సూట్ అవుతాయని ఆశ కల్పించారని చెప్పింది.ఇప్పుడేమో పాలిటిక్స్ నీకెందుకు హ్యాపీగా వ్యాపారం చేసుకో అంటూ మోసం చేశారని వెంగమాంబ ఆరోపించింది. ఆమె ఆరోపణలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్..కొట్టి పారేశారు. కొందరు టీడీపీ నేతలే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలను పురమాయించి వీడియోలు చేయించి కుట్ర చేస్తున్నారని ఫైరయ్యారు. తనపై సొంత పార్టీ నేతలు చేస్తున్న కుట్రలను చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానంటున్నారు.అంతేకాదు కొందరు తనను రెండున్నరేళ్లలో తిరిగి అమెరికా పంపుతానని వాట్సప్ స్టేటస్ పెట్టుకుంటున్నారని.. అది వాళ్ల వల్ల సాధ్యం కాదంటున్నారు కాకర్ల సురేష్. ఇక్కడే ఉంటా..కుట్రలు చేస్తున్న ఒక్కొక్కరి దూల తీరుస్తా..అంటూ హెచ్చరించారు. అయితే వెంగమాంబ అనే మహిళ ఆరోపణల వెనక మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, టీడీపీ నేత వెంగళరావులు ఉన్నారన్న గుసగుసలు కాక రేపుతున్నాయి. ఉదయగిరిలో తమ్ముళ్ల తగువకు అధిష్టానం ఎలా చెక్ పెడుతుందో చూడాలి మరి.

# గ్రౌండ్ లెవెల్‌లో ఏం జరుగుతుందో తెలుసా

విజయవాడ, జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)



కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత గ్రౌండ్ లెవెల్ రియాలిటీని చంద్రబాబుకు చేరకుండా కొందరు అడ్డుపడుతున్నారన్నవిమర్శలున్నాయి. తెలుగుదేశం పార్టీలో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్నది పార్టీ నాయకత్వానికి తెలియడం లేదా అంటే లేదనే సీనియర్ నేతలు అంటున్నారు. క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయిలో నియమించి నెలవారీ జీతాలు చెల్లించి పెట్టుకున్న వారు సయితం పెద్దగా యాక్టివ్ గా లేరని సాక్షాత్తూ గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పడం పార్టీలో చర్చనీయాంశమైంది. చంద్రబాబు నాయుడు, లోకేశ్ లు కేవలం కేంద్ర రాష్ట్ర పార్టీ కార్యాలయంలోని మూడో అంతస్తు నుంచి వచ్చే నివేదికలను చూసి సంబపరపడుతున్నారని, కానీ గ్రౌండ్ లెవెల్లో జరుగుతున్న విషయాన్ని తెలుసుకోలేకపోతున్నారని కొందరు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే సోషల్ మీడియా వేదికగా బయటపెడుతున్నారు. దీంతో పాటు అధికారులు తీసుకుంటున్నారో.. లేక మంత్రుల నిర్ణయమో తెలియదు కానీ.. వైసీపీ నేతలకు, కాంట్రాక్టర్లకు పనులు బాగా ఈ కూటమి ప్రభుత్వంలో అవుతున్నాయన్న ఆవేదన కూడా కార్యకర్తల్లోనూ, నేతల్లోనూ ఉంది. ఆ విషయం కూడా తెలుగుదేశం పార్టీ అనుకూల మీడియాలో పుంఖాను పుంఖాలుగా కథనాలు వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ ఇప్పుడు టీడీపీ హయాంలో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడాన్ని వారు అభ్యంతరం చెబుతున్నారు. అసలు ప్రభుత్వంలో ఏం జరుగుతుందన్నది చంద్రబాబుకు తెలిసి జరుగుతుందా? లేక తెలియక జరుగుతుందా? అని నెట్టింట్లో కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.ఇక తాజాగా తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు తిరుమలకు వచ్చినప్పుడు వైసీపీ నేతలకు టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శనాలు చేయించడం కూడా సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలు ఫైర్ అవుతున్నారు. అసలు ప్రభుత్వంలో ఏం జరుగుతుంది? రాష్ట్రంలో జరుగుతున్న వాస్తవాలు చంద్రబాబు, లోకేశ్ కు చేరకుండా ఎవరైనా అడ్డుపడుతున్నారా?అన్న అనుమానాలను కూడా వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు, లోకేశ్ లు క్యాడర్ కోసం, పార్టీ కోసం కష్టపడిన వారి కోసం నిచేస్తామంటుంటే అందుకు విరుద్ధంగా పనులు జరుగుతుండటం పట్ల కార్యకర్తలు, నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా చంద్రబాబు పాలనలో ఏం జరుగుతుందో సరి చూసుకోవాలంటూ కార్యకర్తలు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే ముద్దు... ఎంపీ వద్దు

శ్రీకాకుళం, జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర పై చాలా ఆశలు పెట్టుకుంది. అందుకే ఆ పార్టీ సీనియర్లకు ఇప్పుడు పెద్దపీట వేస్తోంది. శాసనమండలిలో వైసీపీ పక్ష నేతగా బొత్స సత్యనారాయణకు అవకాశం ఇచ్చింది. ఇక ధర్మాన ప్రసాదరావుకు తాడేపల్లి కార్యాలయ బాధ్యతలతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే ఇదంతా ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాల్లో బలం పెంచుకోవడానికి స్పష్టమవుతోంది. ఉత్తరాంధ్రలో మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఐదు పార్లమెంటు స్థానాలు కొనసాగుతున్నాయి. మొన్నటి ఎన్నికల్లో రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వచ్చింది. అయితే 2029 ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలని భావిస్తోంది ఆ పార్టీ. అయితే అసెంబ్లీ స్థానాలకు పర్వాలేదు కానీ.. పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసేందుకు ఆ పార్టీకి అభ్యర్థులు దొరకడం లేదు.ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, అరకు, అనకాపల్లి, విశాఖపట్నం పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. అందులో ఒక్క అరకులోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ తనుజారాణి ఉన్నారు. మిగతా చోట్ల కూటమి ఎంపీలే కొనసాగుతున్నారు. శ్రీకాకుళం నుంచి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం నుంచి కలి శెట్టి అప్పలనాయుడు, విశాఖ నుంచి శ్రీ భరత్, అనకావల్లి నుంచి సీఎం రమేష్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో సీఎం రమేష్ ఒక్కరే బిజెపి నుంచి ఎంపీగా ఉన్నారు. అయితే టిడిపి కూటమి నుంచి సిట్టింగ్ ఎంపీలు మరోసారి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం పోటీ చేసేందుకు నేతలు ముందుకు రావడం లేదు. దీంతో జగన్మోహన్ రెడ్డి ఆ బాధ్యతను బొత్స సత్యనారాయణకు అప్పగించినట్లు ప్రచారం నడుస్తోంది.శ్రీకాకుళం జిల్లాలో కింజరాపు రామ్మోహన్ నాయుడు వరుసగా మూడుసార్లు ఎంపీ అయ్యారు. బలమైన అభ్యర్థిగా మారారు. ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయనను ఢీకొట్టడం అంటే చాలా కష్టం. 2019 ఎన్నికల్లో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానంలో మాత్రం రామ్మోహన్ నాయుడు గెలిచారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గాను ఐదు చోట్ల వైసిపి గెలిచింది. కానీ రామ్మోహన్ నాయుడు మాత్రం గెలిచారు ఎంపీగా. గడిచిన ఎన్నికల్లో ఆయనపై పోటీ చేసి ఓడిపోయారు పేరాడ తిలక్. 2019లో దువ్వాడ శ్రీనివాస్ పోటీ చేసి ఓడిపోయారు. 2014లో రెడ్డి శాంతి పోటీ చేసి అలానే ఓడిపోయారు. అయితే ఈసారి తమ్మినేని సీతారాం పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. అయితే రామ్మోహన్ నాయుడు కు ధీటైన అభ్యర్థిని రంగంలోకి దించాలని జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేస్తున్నారు. కానీ ఎవరు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అయితే ధర్మాన ఫ్యామిలీ నుంచి ఒకరిని బరిలో దించితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.విజయనగరం ఎంపీగా ప్రస్తుతం కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ పై గెలిచారు. 2029 ఎన్నికల్లో మరోసారి బెల్లాన చంద్రశేఖర్ పోటీ చేస్తానని చెబుతున్నారు. కానీ ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు బొత్స ఝాన్సీ లక్ష్మి ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో ఆమె ఇదే స్థానం నుంచి ఎంపీగా ఉండేవారు. మొన్నటి ఎన్నికల్లో విశాఖ నుంచి ఆమె పోటీ చేశారు. మరోవైపు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేరు కూడా వినిపిస్తోంది. అయితే ఇక్కడ బొత్స సత్యనారాయణ నిర్ణయం పనిచేయనుంది.విశాఖపట్నం నుంచి మరోసారి పోటీ చేసేందుకు మాజీ ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఆసక్తి చూపిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆయన అసెంబ్లీకి పోటీ చేశారు. అయితే విశాఖ నుంచి మరోసారి బొత్స ఝాన్సీలక్ష్మి అయితే బాగుంటుందని జగన్ అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. మరోవైపు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పోటీ చేస్తే బాగుంటుందని వైసీపీ క్యాడర్ అంటుంది. కానీ అమర్నాథ్ మాత్రం తాను పోటీ చేయనని తేల్చి చెబుతున్నారు. తనకు విశాఖ నగరం పరిధిలో ఏదో ఒక అసెంబ్లీ స్థానం టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు.అనకాపల్లి నుంచి గత ఎన్నికల్లో పోటీ చేశారు బూడి ముత్యాల నాయుడు. మాడుగుల నియోజకవర్గం నుంచి గెలిచిన ఆయనను జగన్మోహన్ రెడ్డి క్యాబినెట్ లోకి తీసుకున్నారు. డిప్యూటీ సీఎం పదవి కూడా ఇచ్చారు. మొన్నటి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా సీఎం రమేష్ రంగంలోకి దిగారు. దీంతో జగన్మోహన్ రెడ్డి బూడి ముత్యాల నాయుడు తో పోటీ చేయించారు. కానీ ఆయనకు ఓటమి తప్పలేదు. మరోసారి ఎంపీగా పోటీ చేయాలని జగన్మోహన్ రెడ్డి సూచిస్తున్నారు. కానీ అందుకు ముత్యాల నాయుడు సుముఖంగా లేరు. తిరిగి మాడుగుల అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తానని చూస్తున్నారు. అయితే అరకులో మాత్రం మరోసారి డాక్టర్ తనుజారాణికి అవకాశం ఇవ్వనున్నారు. ఆమె కాకుంటే మాత్రం మాజీ ఎంపీ బొడ్డేటి మాధవికి అవకాశం కల్పిస్తారు. అయితే వైసీపీలో ఉన్న నేతలంతా అసెంబ్లీ వైపు మొగ్గు చూపుతున్నారే కానీ.. పార్లమెంట్ స్థానాలపై మాత్రం ఆసక్తి కనబరచడం లేదు.

# రోడ్డు ప్రమాద బాధితులను వెంటనే ఆసుపత్రికి తరలించాలి

## -జిల్లా ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్

## -మంథనిలో విద్యార్థులకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించిన రవాణా శాఖ



మంథని జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)

ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే ప్రజలు వీడియోలు తీయకుండా గాయపడ్డ బాధితులను వెంటనే ఆసుపత్రికి తరలిస్తే వారు బ్రతికే అవకాశం మెండుగా ఉంటుందని జిల్లా ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు జనవరి 2026లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం, రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాల నివారణకై మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో,మండలంలోని ఎగ్లాస్పూర్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత పై అవగాహన సదస్సులను జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రమాదాల నివారణపై ట్రాఫిక్ రూల్స్ పై విద్యార్థిని విద్యార్థులకు ప్రమాదాలు జరగకుండా ఎలా ఉండాలనే అంశంపై అధికారులు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు వారు డ్రైవింగ్ చేయవద్దని, రాష్ డ్రైవింగ్ చేయవద్దని హెల్మెట్ ధరించాలని డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని సీట్ బెల్ట్ ధరించాలని అవగాహన పెంపొందించారు. ఈ సందర్భంగా ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రతిరోజు 20 దాకా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు చనిపోతున్నారని, చాలామంది ప్రమాదాల ద్వారా అంగవైకల్యం కలుగుతుందని తెలిపారు. అందుకే రవాణా శాఖ నియమ నిబంధనలను పాటించి సురక్షితంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత సమిష్టిగా అందరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నిఖిల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఉష, పిఇటి రవి,హెడ్మాస్టర్లు అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# హరిద్వార్‌లోని గంగా ఘాట్‌లలో హిందువులకే ఎంట్రీ

ఉత్తరాఖండ్, జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)



హరిద్వార్‌లోని 105 ఘాట్‌లలోకి హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధించాలని ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వం యోచిస్తోంది. రిషికేశ్, హరిద్వార్‌లను 'సనాతన పవిత్ర నగర్'లుగా ప్రకటించే ప్రతిపాదన కూడా ఉంది. అయితే, 1916 నాటి ఒప్పందాన్ని పరిశీలిస్తూ, అర్ధ కుంభ్ మేళా నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆధ్యాత్మిక గుర్తింపును కాపాడతామని తెలిపారు. అయితే, స్థానికులు మాత్రం దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది మన మతం విధానం కాదని అంటున్నారు.రిషికేశ్, హరిద్వార్‌లను 'సనాతన పవిత్ర నగర్'లుగా ప్రకటించాలని కూడా పుష్కర్ సింగ్ ధామి ప్రభుత్వం భావిస్తోంది. 2027 జనవరి 14న మకర సంక్రాంతికి ప్రారంభం కానున్న అర్ధ కుంభ్ మేళా నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.ఈ విషయంలో 1916లో భారతరత్న పండిట్ మదన్ మోహన్ మాలవ్యా, బ్రిటిష్ ప్రభుత్వానికి మధ్య జరిగిన ఒప్పందం వివరాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. గంగా సభకు తొలి అధ్యక్షుడిగా మాలవ్యా వ్యవహరించారు. ఆ ఒప్పందం ప్రకారం.. గంగా నది ప్రవాహాన్ని నిరంతరాయంగా కొనసాగించడం, పుణ్యనగరం పవిత్రతను కాపాడటం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా గంగా ఘాట్‌లలోకి హిందూయేతరుల ప్రవేశంపై ఆంక్షలు విధించారు. అంతేకాదు, రిషికేశ్, హరిద్వార్‌లలో హిందువులు కానివారు శాశ్వతంగా నివసించడానికి వీలులేదు. వారు కేవలం పని నిమిత్తం వచ్చి, తమ పనులు పూర్తయ్యాక తిరిగి వెళ్లిపోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ అసలు ఒప్పందంలోని నిబంధనలను పునరుద్ధరించాలని తీవ్రంగా పరిశీలిస్తోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

గంగా సభ అధ్యక్షుడు నితిన్ గౌతమ్ గతంలో మాట్లాడుతూ.. 'హరిద్వార్ పవిత్రతను కాపాడటానికి, మొత్తం కుంభ్ మేళా, హరిద్వార్ నగరాన్ని హిందువులు కానివారికి నిషేధిత ప్రాంతంగా ప్రకటించాలి. వారి ప్రవేశాన్ని నిషేధించాలి. హరిద్వార్, రిషికేశ్‌లలోని అన్ని నదీ తీరాలు వారికి ప్రవేశం ఉండకూడదు' అని అన్నారు. అయితే తాను విశ్వ హిందూ పరిషత్ (హరిద్వార్) మాజీ అధ్యక్షుడిగా ఆ డిమాండ్ చేశానని, గంగా సభలో దీనిపై ఎలాంటి తీర్మానం చేయలేదని చెప్పారు.రాజకీయ పార్టీలు కూడా ఈ విషయంపై స్పందించాయి. కాంగ్రెస్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అశోక్ శర్మ మాట్లాడుతూ.. "హిందూయేతరుల ప్రవేశం నిషేధాన్ని హరి-కి-పౌరి మాత్రమే పరిమితం చేయాలని కోరిన మదన్ మోహన్ మాలవ్యా కంటే బీజేపీ-ఆర్ఎస్ఎస్ పెద్ద హిందువులా? ఈ నిషేధాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం" అని అన్నారు. హరిద్వార్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సందీప్ గోయల్ మాట్లాడుతూ.. 'ఇది మా పార్టీ విధానం కాదు...' అని తెలిపారు.

# పాకిస్తాన్ లో కరువు ఛాయలు

న్యూఢిల్లీ జనవరి 8, ( (భారత శక్తి ప్రతినిధి)

గత ఏడాది ఏప్రిల్‌లో జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి జరిగింది. 26 మంది పర్యాటకులు చనిపోయారు. దీంతో భారత ప్రభుత్వం సింధు జల ఒప్పందం రద్దు చేసింది. 1969లో జరిగిన ఈ ఒప్పందం నిలిపివేయడంతో మన దేశం నుంచి పాకిస్తాన్‌లోకి వెళ్లాల్సిన జలాలు ఆగిపోయాయి. అవసరం లేని సమయంలో వరదలు వస్తున్నాయి. తాజాగా ఒప్పందం నిలివేత ఎఫెక్ట్ పాకిస్తాన్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. చుక్క నీరు కూడా పాకిస్తాన్ దాటి వెళ్లడం లేదు. దీంతో దాయాది దేశంలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి.భారత్ పాక్‌పై ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రతీకారంగా ఈ చర్య తీసుకుంది. పాకిస్తాన్‌లో సింధు, జెహ్లం, చెనాబ్ నదులపై ఆధారపడిన వ్యవసాయం, రోజువారీ జీవనం కష్టమవుతోంది. డ్యామ్‌ల నిర్మాణం, నీటి నిల్వలు భారత్‌కు ప్రయోజనకరంగా మారాయి. ఇప్పటికే పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్‌లో తాజాగా జల సంక్షోభం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు.పాకిస్తాన్ మొత్తం వ్యవసాయంలో చాలా వరకు సింధు జలాలపై ఆధారపడి సాగుతోంది. నీటి నిలిపివేతతో 30 నుంచి 40 శాతం వ్యవసాయం తగ్గే అవకాశం ఉంది. ఆహార భద్రత దెబ్బతినే ప్రమాదం ఉంది. నదీ ప్రవాహ మార్పులు డెల్టా ప్రాంతాల్లో ఉప్పు పెరగడం, జీవవైవిధ్య నష్టానికి దారితీస్తాయి. ఈ నేపథ్యంలో పాక్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వం కోరవచ్చు. కానీ భారత్ దృఢంగా నిలబడుతుంది. ఒప్పందం పునరుద్ధరించే అవకాశాలు తక్కువ.

# తమిళనాడు ఎన్నికల వేళ సినిమా ఫైట్

## జననాయగన్ Vs పరాశక్తి..

చెన్నై, జనవరి 8, ( (భారత శక్తి ప్రతినిధి)

తమిళనాడులో ఈసారి పొంగల్‌కు సినిమాలు మాత్రమే కాకుండా.. రాజకీయాలు కూడా బాగా హాట్ హాట్‌గా మారనున్నాయి. రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ నటిస్తున్న జననాయగన్ సినిమాకు పోటీగా.. డీఎంకేతో సంబంధం ఉన్న పరాశక్తి సినిమాలు.. ఇప్పుడు పొంగల్ బరిలో నిలిచాయి. అయితే ఈ రెండు సినిమాలకు సక్సెస్, కలెక్షన్ల గురించి మాత్రమే కాకుండా.. ఈ ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముడిపడి ఉండటంతో.. సినీ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా.. రాజకీయ వర్గాలు, కార్యకర్తలు, తమిళ ప్రజలందరికీ ఇప్పుడు అంతా ఈ రెండు సినిమాలపైనే ఫోకస్ పెట్టారుతమిళనాడులో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ ఎన్నికల కోసం ఆ రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలతోపాటు.. కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలు కూడా బాగా దృష్టి పెట్టాయి. అధికారంలో ఉన్న ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీని గద్దె దించాలని అటు బీజేపీ, ఇటు కొత్తగా విజయ్ పెట్టిన తమిళగ వెట్రి కళగం పార్టీ వ్యూహ ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే తమిళనాడు ఎన్నికల్లో హోరాహోరీ పోరు తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే అంతకంటే ముందు.. ఈసారి పొంగల్ (సంక్రాంతి) పండగకు తమిళ సినిమాల జోరు కొనసాగనుంది. అయితే ఈ పొంగల్ సినిమాలు కేవలం సినిమాలకు మాత్రమే పరిమితం కాకుండా.. రాజకీయాల్లో కీలక మలుపు తెచ్చే అవకాశాలు ఉన్నాయనే చర్చ ఇప్పుడు విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల యుద్ధం ఈ పొంగల్‌కు బాక్సాఫీస్ వద్దే మొదలవుతోందని రాజకీయ, సినీ వర్గాలు చెబుతున్నాయి. టీవీకే పార్టీని పెట్టి రాజకీయ అరంగేట్రం చేసిన దళపతి విజయ్.. ఈసారి ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం విడుదలకు సిద్ధంగా ఉన్న జన నాయగన్ చిత్రం.. తన కెరీర్‌లో 69వది కాగా.. ఇదే చివరిది అని ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమా ఈనెల 9వ తేదీన థియేటర్లలోకి రానుంది. అవినీతి వ్యవస్థపై పోరాడే ఒక సామాన్య యువకుడి కథగా ఈ సినిమాను రూపొందించారు. 'నేను వస్తున్నాను.. వెనక్కి తగ్గేది లేదు' అనే డైలాగులు నేరుగా రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశించినవే అని అభిమానులు భావిస్తున్నారు. ఈ జన నాయగన్ సినిమాకు హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తుండగా.. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.అయితే డీఎంకే నేపథ్యం కలిగి ఉన్న పరాశక్తి సినిమా ఈనెల 10వ తేదీన విడుదల కానుంది. పరాశక్తి సినిమాలో శివకార్తికేయన్ హీరోగా నటిస్తున్నారు. డీఎంకే స్టాలిన్ తండ్రి, తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి కుటుంబానికి చెందిన ఆకాష్ భాస్కరన్ ఈ పరాశక్తి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 1952లో కరుణానిధి రాసిన క్లాసిక్ చిత్రం పరాశక్తి పేరునే ఈ సినిమాకు పెట్టడం గమనార్హం. 1960లలో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. హిందీ రుద్దుడు అంశాన్ని ప్రధానంగా తీసుకుని డీఎంకే సిద్ధాంతాలను ప్రతిబింబించేలా ఈ సినిమాను రూపొందించారు. శివకార్తికేయన్, అథర్వ మురళి ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. సుధా కొంగర డైరెక్టర్.రాజకీయ సందేశంతో జన నాయగన్ సినిమాను తెరకెక్కించగా.. డీఎంకే పార్టీ తన ద్రావిడ సిద్ధాంతాలతో పరాశక్తిని కౌంటర్‌గా బరిలోకి దించుతోంది. ఈ రెండు సినిమాల ఫలితం కేవలం వసూళ్లపైనే కాకుండా.. రాబోయే ఎన్నికల మూడ్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు.. ఈ రెండు సినిమాలు విడుదలకు ముందే.. దానికి సంబంధించిన ఫైటింగ్ మొదలైంది. ఈ సినిమా పోరు కేవలం థియేటర్లకే పరిమితం కాకుండా.. బయట కూడా ముదిరింది.మధురైలో జన నాయగన్ ట్రైలర్ ప్రదర్శన సమయంలో.. పరాశక్తి సినిమా పోస్టర్లను విజయ్ అభిమానులు చింపేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే పరాశక్తి ఆడియో లాంచ్ సమయంలో టీవీకే పార్టీ నినాదాలతో విజయ్ ఫ్యాన్స్ రచ్చ చేశారు. దీంతో సినిమాలు విడుదల కాకముందే ఇలాంటి పరిస్థితి ఉంటే.. అవి థియేటర్లలోకి వస్తే.. పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తానికి ఈ పొంగల్ మాత్రం తమిళనాడులో సినిమాల కంటే పొలిటికల్ హీట్ పెంచుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి.


# గులాబీకి వరుస చిక్కుముళ్లు

హైదరాబాద్, జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)




రాజకీయాలలో ముఖ్యంగా కుటుంబాలు నడిపే పార్టీలలో అంతర్గతంగా కుమ్ములాటలు చోటు చేసుకోవడం మనదేశంలో కొత్తేమీ కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ లో సంజయ్ గాంధీ వ్యవహార శైలి ఈ దేశ ప్రజలకు సుపరిచితమే. తమిళనాడులో డీఎంకే, ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు.. అంతిమంగా అధికారం కోసం, అలవిమాలిన సంపాదన కోసం జరిగే పోరాటాలు ప్రాంతీయ కుటుంబ పార్టీల అసలు బాగోతాన్ని బయటపెడతాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి భారత రాష్ట్ర సమితి కూడా చేరింది. 2014లో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలంగాణలో వ్యవస్థలను ఎంత నాశనం చేయాలో అంత చేసింది. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలను అడ్డగోలుగా కొనేసింది. ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకుంది. కాళేశ్వరం నుంచి మొదలు పెడితే గొర్రెల పంపిణీ వరకు ఇలా ప్రతి పథకంలోనూ అవినీతి జరిగిందని, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వినిపించాయి. వాస్తవానికి ఇటువంటి కుంభకోణాలు పార్టీకి డ్యామేజ్ చేయడం ఒక ఎత్తు అయితే.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కలిగించే డ్యామేజ్ మరొక ఎత్తు.వాస్తవానికి గులాబీ పార్టీలో ఈ స్థాయిలో అంతర్గతంగా కుమ్ములాటలు జరుగుతాయని ఎవరూ ఊహించలేదు. సాక్షాత్తు కెసిఆర్ కుమార్తె వ్యతిరేక స్వరాన్ని వినిపిస్తారని.. తన తండ్రి పరిపాలనను ఉదాహరణలతో వివరిస్తూ విమర్శిస్తారని ఎవరూ అంచనా వేయలేదు. కాళేశ్వరం ప్రయోజనం నెరవేరలేదని, పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పండబెట్టారని, సామాజిక తెలంగాణ సహకారం కాలేదని ఇలా ప్రతి విషయంలోనూ కవిత విమర్శలు చేసుకుంటూ పోయారు. కొన్ని సందర్భాలలో లెక్కలతో సహా వివరించారు. ఒక రకంగా ఈ పనిని కాంగ్రెస్ చేయాల్సి ఉండేది. ఒక రకంగా బలమైన స్వరాన్ని వినిపించే ప్రయత్నం చేశారు కవిత.కవిత చేస్తున్న ఆరోపణల్లో నిజం లేకపోలేదు. కానీ 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఏం చేశారు అనేది ఇక్కడ అసలైన ప్రశ్న. భారత రాష్ట్ర సమితి ఏర్పాటును వ్యతిరేకించానని చెప్పిన ఆమె.. పార్టీ ప్రారంభత్సవానికి ఢిల్లీ ఎందుకు వెళ్లినట్టు? 10 సంవత్సరాల కాలంలో తెలంగాణలో విధ్వంసం జరిగిందని చెబుతున్న ఆమె.. గతంలో బంగారు తెలంగాణ సాకారం అయిందని ఎందుకు చెబుతున్నట్టు.. లిక్కర్ కేసులో అడ్డంగా ఇరుక్కుపోయారు కాబట్టి.. కేసుల నుంచి తప్పించుకోవాలంటే ఆమె కెసిఆర్ కు వ్యతిరేకంగా వ్యవహరించాలి కాబట్టి.. అలానే చేస్తున్నారని గులాబీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి రాజకీయాల లక్ష్యాలకు అనుగుణంగా ఆమె నడుచుకుంటున్నారని గులాబీ నేతలు మండిపడుతున్నారు.వాస్తవానికి తన పార్టీలో ఉన్నప్పుడు ప్రాధాన్యం దక్కలేదని పదేపదే ఆరోపిస్తున్న కవిత.. ఒకసారి ఎంపీ ఎలా అయ్యారు? మరోసారి ఎమ్మెల్సీ ఎలా అయ్యారు? సింగరేణిలో అధ్యక్షురాలిగా ఎలా ఉన్నారు? ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయని గులాబి పార్టీ నేతలు అంటున్నారు. అధికారం దూరంగానే కెసిఆర్ కు వ్యతిరేకంగా మాట్లాడటం సమంజసం కాదని ఆమెకు గుర్తుచేస్తున్నారు. మరోవైపు జాగృతి నేతలు స్పందిస్తున్న తీరు వేరే విధంగా ఉంది. కేటీఆర్ కూడా ఆమెకు ద్రోహం చేశారని.. కనీసం ఒక పని కూడా చేసుకునే అవకాశం కల్పించలేదని.. ఆమె భర్త ఫోన్ కూడా టాప్ చేశారని.. అలాంటప్పుడు ఆమె పార్టీలో ఎలా ఉంటారంటూ జాగృతి నేతలు చెబుతున్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో హరీష్ రావు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని.. అందువల్లే కవిత ఆయన టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేస్తున్నారని జాగృతి నేతలు చెబుతున్నారు.. కవిత రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేక ఆమెకు అడుగడుగునా అడ్డు పుల్లలు వేస్తున్నారని.. అందువల్లే కవిత ఈ స్థాయిలో స్పందిస్తున్నారని జాగృతి నేతలు అంటున్నారు.కవితకు, కెసిఆర్ కు మధ్యలో గ్యాప్ రావడానికి ప్రధాన కారణం హరీష్, సంతోష్ రావు అని జాగృతి నేతలు చెబుతున్నారు. అందువల్లే ఆమె ఆధారాలతో సహా విమర్శలు చేస్తున్నారని.. ఇందులో వ్యక్తిగత లక్ష్యాలు అంటూ ఏమీ లేవని జాగృతి నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ అంతపురంలో జరిగే కుమ్ములాటలు రాజ్యానికి అసలు మంచివి కావు. ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా ఆ పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఇప్పటికే పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలు వచ్చాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో అధికార పార్టీకి సానుకూలమైన ఫలితాలు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలు కూడా గులాబీ పార్టీకి రాలేదు. అలాంటప్పుడు ఈ అంతర్గత కుమ్ములాటను ఏ స్థాయిలో కేసీఆర్ పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది.

# 20న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్



హైదరాబాద్, జనవరి 8, ( (భారత శక్తి ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. గతేడాది డిసెంబర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ).. ఇప్పుడు పట్టణ పోరుపై దృష్టి సారించింది. జనవరి 20వ తేదీ నాటికి రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో.. దానికి సంబంధించి ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ జనవరి 12 అని తెలిపారు. అదే రోజున ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని మొదట ఆదేశించారు. టీ పోల్ యాప్‌లో, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను జనవరి 13వ తేదీన అప్‌లోడ్ చేయాలి. జనవరి 16వ తేదీన ఫోటోలతో కూడిన ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నారు. వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను కూడా ఆరోజే వెల్లడిస్తారు. ఇక జనవరి 20వ తేదీన మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.2019 నాటి ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని.. బీఎల్‌వోల ద్వారా క్షేత్రస్థాయిలో వివరాల పరిశీలన జరుగుతోంది. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రిని సిద్ధం చేయాలని కలెక్టర్లను ఈసీ ఆదేశించింది. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయడానికి ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ అయ్యాయి. గురువారం రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించి, వారి సూచనలను తీసుకోనుంది.తుది ఓటర్ల జాబితాను ఆయా వార్డు పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దీనివల్ల ఓటర్లకు తమ పోలింగ్ కేంద్రం, బూత్ వివరాలు తెలుస్తాయని ఈసీ వెల్లడించింది. మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలపైనా కలెక్టర్లకు ఈసీ దిశానిర్దేశం చేసింది. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సిబ్బంది నియామకం, రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించి.. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని ఎన్నికల కమిషన్ సూచించింది.

### గెలుపు గుర్రాలపై గురి

మున్సిపల్ ఎన్నికలపై అధికార పార్టీ ప్రత్యేక గురి పెట్టింది. పంచాయతీ ఎన్నికలలో వచ్చిన ఫలితాలను మున్సిపల్ ఎన్నికల్లో పునరావృతం కాకుండా అధికార పార్టీ ఆచితూచి అడుగులు వేస్తుంది.మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని స్థానాల ' పైచేయి' సాధించేలా క్షేత్రస్థాయి కసరత్తులు ముమ్మరం చేసింది. ఇప్పటికే పార్టీ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా మున్సిపాలిటీ వారిగా సర్వే చేయించి పార్టీ బలాలు, బలహీనతలు పై దృష్టి సారించింది.సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం పీసీసీ చీఫ్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించి...జిల్లా ఇన్చార్జి మంత్రులతో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యేలు పార్టీ ఇంచార్జిల కు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా లో ఉన్న మున్సిపాలిటీలో అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకునేలా ఎత్తుగడలు వేయాలని ఎక్కడ కూడా ప్రతిపక్ష పార్టీకి అవకాశం ఇవ్వొద్దు అంటూ అంతర్గతంగా నేతలకు దిశా నిర్దేశం చేశారు. మున్సిపాలిటీ ఎన్నికల పై ప్రధాన రాజకీయ పార్టీలు సైతం కసరత్తు ముమ్మరం చేశాయి.మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. అసంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చతికిలపడినప్పటికీ స్థానిక పోరు బూలో బీఆర్ఎస్, బీజేపీ లు అనూహ్యంగా పుంజుకోవడం తో ఆ పార్టీ శ్రేణుల్లో కొంత ఆత్మస్థైర్యం నింపినట్ల య్యింది. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు బిఆర్ఎస్, బిజెపి పార్టీ లు సైతం ఎన్నికల కు సై అంటుంది. దీంతో ఆయా పార్టీ లు గెలుపు కోసం వ్యూహరచన చేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 15 మున్సిపాలిటీలు మూడు కార్పొరేషన్లు ఉండగా అందులో ఎనిమిది మున్సిపాలిటీలు మూడు కార్పొరేషన్లను ఇటీవల ప్రభుత్వం జిహెచ్ఎంసిలో విలీనం చేసింది. ప్రస్తుతం ఆమనగల్, షాద్నగర్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, మొయినాబాద్, శంకర్పల్లి మున్సిపాలిటీ ఎన్నికలకు అధికారులు సన్నాహాలు చేస్తుండగా కొత్తూరు మున్సిపాలిటీ కి పాలకవర్గం గడువు తీరకపోవడం తో అక్కడ ఎన్నికలు మరింత సమయం పడుతుంది. మిగతా ఆరు మున్సిపల్ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల ను గెలుచుకొంది. రాష్టంలో అధికారం కోల్పోయి మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మళ్ళీ పురఎన్నికలో పట్టు నిలుపుకునేలా ఎత్తుగడలు వేస్తుంది. నియోజకవర్గాలో సన్నాహక సమావేశాలు నిర్వహించి పార్టీ నేతల్లో ఉత్సాహం నింపుతుంది. మున్సిపాలిటీ,వార్డుల వారిగా బస్తి బాట పేరుతో ప్రచారానికి సైతం దిగింది. వార్డుల వారిగా రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులను గెలుపు గుర్రాలను అధికారపాటికి దీటుగా నిలబెట్టేలా వ్యూహాలు సిద్ధం చేసే పనులు పార్టీ నేతలు నిమగ్నంగా అయ్యారు.పురపాలికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేలా వ్యూహాలకు పదును పెడుతోంది. ఈ మేరకు ఇప్పటికే రంగారెడ్డి జిల్లా లో ఆరు మున్సిపల్ పరిధిలో ఆయా పార్టీ అధ్యక్షులు ఇప్పటికే సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయా డివిజన్ల వారీగా పార్టీ పరిస్థితి, గెలుపు గుర్రాలపై కీలక నేతలతో చర్చించారు. గెలవడానికి ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని.. పార్టీ అభ్యున్నతే లక్ష్యంగా ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ కు దీటుగా అభ్యర్థులను రంగంలోకి దించేలా క్షేత్రస్థాయిలో గెలుపు గుర్రాలను జల్లెడ పట్టే బాధ్యతలను పలువురికి అప్పగించినట్లు సమాచారం.స్థానిక పోరు లో విజయం సాధించినా కానీ కాంగ్రెస్ లో కొంత అసంతృప్తి నెలకొంది. మెజార్టీ స్థానాలు సాధించలేకపోయామని నేతలు బహిరంగంగానే తమ లోపాలను బయట పెట్టుకున్నారు. సమన్వయంతో పార్టీలో ముందుకు వెళ్ళలేదని పంచాయతీలో వచ్చిన ఫలితాలను చూసి తమ తప్పులను ఒప్పుకుంటున్నారు. పంచాయతీ లో బీఆర్ఎస్ పుంజు కోవడం తో కాంగ్రెస్ నేతలను కొంత ఇరకాటంలో పడేసినట్లయ్యింది.స్థానిక పోరు లో బీఆర్ఎస్, బీజేపీ మద్దతుదారులు గెలవడా నికి ప్రధాన కారణం స్వపక్షంలోని రెబల్స్ అభ్యర్థులేనని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తించింది. సీఎం సైతం జిల్లా, నియోజకవర్గా ల వారిగా ఫలితాలను చూసి కొంత అసంతృప్తి వెళ్ళగక్కారు. నియోజకవర్గం ఫలితాలను చూసి అందుకు బాధ్యులపై చీవాట్లు పెట్టారు. ఈ నేపథ్యంలో పురపాలక పోరులో రెబల్స్ ప్రభావం లేకుండా ఆ పార్టీ ముఖ్య నేతలు ఆచితూచి వ్యవహరిస్తు న్నారు. ఇందులో భాగంగా ఆయా డివిజన్లు / వార్డుల వారీగా ఆశా వహులు,కౌన్సిలర్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరి స్తోంది. ప్రస్తుతం వ్యక్తిగత సమాచారం తో పాటు ఆయా వార్డుల్లో బలా బలాలు, సామాజిక వర్గాల వారిగా ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా అభ్యర్థులను ఖరారు ఖరారు చేసే పనులు ప్రస్తుతం నేతలు నిమగ్నం అయ్యా

# టాప్ గేర్ లో రియల్ ఎస్టేట్

హైదరాబాద్, జనవరి 8, (భారత శక్తి ప్రతినిధి)



దేశంలోని 8 ప్రధాన నగరాల్లో చూస్తే హౌసింగ్ సేల్స్ (ఇళ్లు లేదా ఫ్లాట్ల విక్రయాలు) గతేడాది 3.48 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. ఇది అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే స్వల్పంగా ఒక శాతం తగ్గిందని చెప్పొచ్చు. అయితే ఇదే సమయంలో ఈ ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 19 శాతం వరకు పెరిగినట్లు పేర్కొంది. బుధవారం రోజు వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా ఈ డేటా విడుదల చేసింది. ఇక్కడ ప్రధానంగా హోం లోన్ వడ్డీ రేట్లు తగ్గడం సహా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటం, ద్రవ్యోల్బణం తగ్గుతుండటం వంటివి హౌసింగ్ డిమాండ్‌ను స్థిరంగా ఉంచేందుకు దోహదం చేసినట్లు తెలిపింది. ఈ 8 ప్రధాన నగరాలు చూస్తే ఢిల్లీ- ఔఅఖీ, ముంబై, బెంగళూరు, పుణె, హైదరాబాద్, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా ఉన్నాయి.ఇక్కడ ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే సేల్స్ కాస్త ఎక్కువగా పెరిగాయి. ఇక్కడ 2025 సంవత్సరంలో మొత్తం ఇళ్ల విక్రయాలు 4 శాతం పెరిగి 38,403 యూనిట్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో ఇళ్లు లేదా ఫ్లాట్స్ ధరలు కూడా 13 శాతం వరకు పెరిగి చదరపు అడుగుకు సగటు ధర రూ. 6,721 గా ఉంది. రెండో అర్ధభాగంలో అంటే జులై-డిసెంబర్ సమయంలో హౌసింగ్ సేల్స్ హైదరాబాద్ నగరంలో 19,355 గా ఉండగా.. ఇది అంతకుముందు సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 5 శాతం ఎక్కువ.కొత్త ఇళ్ల సప్లై విషయానికి వస్తే 2025లో హైదరాబాద్‌లో ఇది 40,737 యూనిట్లుగా ఉండగా.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 7 శాతం తగ్గింది. ఇక 2025లో అన్‌సోల్డ్ ఇన్వెంటరీ అంటే అమ్ముడుపోని ఇళ్లు లేదా ఫ్లాట్ల సంఖ్య హైదరాబా?ద్‌లోనే 54,878 యూనిట్లుగా ఉండటం గమనార్హం. అంటే ఇక్కడ డిమాండ్‌కు మించి కొత్త ఇళ్ల సప్లై ఉండటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, ఉద్యోగాల సృష్టిలో దూసుకెళ్తుండటం వల్ల రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతున్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్ తెలిపింది.ముంబైలో హౌసింగ్ సేల్స్ ఒక శాతం పెరిగి 97,188 యూనిట్లుగా ఉంది. ఇక్కడ సగటున ఇళ్ల ధరలు 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,856 గా ఉంది. బెంగళూరులో ఇళ్ల విక్రయాలు స్థిరంగా 55,373 యూనిట్లుగా ఉంది. ఇళ్ల ధరలు సగటున 12 శాతం వరకు పెరిగి చ.అడుగుకు రూ. 7,388 గా ఉంది. పుణె, ఢిల్లీ- ఔఅఖీ, కోల్‌కతాలోనూ ఇళ్ల అమ్మకాలు కాస్త తగ్గుముఖం పట్టాయి.

# రోడ్డు భద్రతే లక్ష్యం.. ప్రాణాల రక్షణే ముఖ్యం...

## - టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి

### - రోడ్డు భద్రత అవగాహనలో భాగంగా ఐబి నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించిన రవాణా శాఖ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 8:

జాతీయ రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా గురువారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై




ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐబి నుండి జిల్లా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో వివిధ బైక్ షోరూం లకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టి.జి.ఐ.ఐ.సి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రాణాలు చాలా విలువైనవని, నిర్లక్ష్యంతో ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని తెలిపారు. డీఎస్పీ సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ, రోడ్డు సేఫ్టీ నిబంధనలను క్రమశిక్షణతో పాటిస్తే ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి కావాలని తెలిపారు. జిల్లా రవాణా అధికారి అరుణ మాట్లాడుతూ, రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు రోడ్డు భద్రతపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహి

స్తున్నామని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి అరుణ, డీఎస్పీ సత్తయ్య గౌడ్, రవాణా శాఖ సభ్యులు తాహెర్, సంబంధిత అధికారులు, సిబ్బంది, వివిధ బైక్ షోరూం ల ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాజముద్రతో భూములపై రైతులకే సర్వహక్కు: జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత

వై ఎస్ ఆర్ కడప, జనవరి 08(భారత శక్తి): రాజముద్రతో మీ భూములపై మీకే హక్కు కల్పించేలా కూటమి ప్రభుత్వం నూతన పట్టాదారు పాస్ బుక్ లు రూపొందించిందని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కడప జిల్లా నందలూరు మండలం యల్లమ్మరాజుపల్లి గ్రామంలో మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ బుక్ లను మంత్రి సవిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి మాట్లాడుతూ. ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దు చేసి పట్టాదారు పాస్ బుక్ లపై రాజముద్రను ముద్రించామన్నారు. ఈ ముద్రతో రైతులకు తమ భూములపై సర్వ హక్కులు కలిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. విద్యార్థులకు అందజేసిన విద్యా మిత్ర కిట్లపైనా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటోను ముద్రించామన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వే వల్ల ఎన్నో సమస్యలు తలెత్తాయన్నారు. గ్రీవెన్స్ లకు వస్తున్న అర్జీల్లో అత్యధిక శాతం భూ సమస్యలపైనేనన్నారు. రెవెన్యూ సమస్యలపై పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సవిత తెలిపారు.



వ్యవసాయంలో సాంకేతికతకు పెద్దపీట...

రైతులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత సూచించారు. పంటల సాగులో అధికారుల సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకోవాలన్నారు. స్మార్ట్ వ్యవసాయం ద్వారా అత్యధిక లాభాలు ఆర్జించాలన్నారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. వ్యవసాయంలో యంత్రీకరణ కు, సాంకేతికతకు పెద్దపీటే వేస్తోందన్నారు. డ్రిప్ లు, స్ప్రింక్లర్లు, డ్రోన్లు రైతులకు అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించిన ఘనత సీఎం చంద్రబాబుదన్నారు. యూనిట్ పై 13 పైసలు చొప్పున్న తగ్గించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ బుక్ లను జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ భావన, ఇన్చార్జి జేసీ మరియు డి ఆర్ ఓ విశ్వేశ్వర నాయుడు రెవెన్యూ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాలో సరిపోను యూరియా నిల్వలు ఉన్నాయి

## -రైతులెవరు అధైర్యపడాల్సిన అవసరం లేదు
## -జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారతశక్తి జిల్లా ప్రతినిధి)డిసెంబర్ 8:

సూర్యాపేట జిల్లాలో రైతులందరికీ సరిపోయిన ఎరువులు యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ అన్నారు. గురువారం సూర్యాపేట మండలం పిల్లలమర్రి పిఏసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల గోదామును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్, ఈ పాస్ మిషన్ లను పరిశీలించారు. ఇప్పటివరకు పిల్లలమర్రి పిఏసిఎస్ ద్వారా 290.43 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకి పంపిణి చేశామని ప్రస్తుతం 11.90 మెట్రిక్ టన్నుల (266 బస్తాలు ) యూరియా నిల్వలు ఉన్నాయని ఇంకో 100 మెట్రిక్ టన్నుల యూరియా అయితే ఈ యాసంగి సీజన్ కు సరిపోతుందని శుక్రవారం సాయంత్రం నాటికి మరో రెండు లారీల యూరియా లోడ్లు వస్తుందని ఏ డి ఏ కలెక్టర్ కు వివరించగా ఎంత యూరియా అవసరం ఉంటే అంత సరఫరా చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ అక్కడే ఉన్న రైతులతో మాట్లాడుతూ ఎరువులు మంచిగా



సరఫరా చేస్తున్నారా? ఒక ఎకరం వరి పంట ద్వారా ఎంత ఖర్చవుతుంది, ఎంత దిగుబడి వస్తుందని అడగగా 25 వేల వరకు ఖర్చు అవుతుందని, 33 వేలు మిగులుతాయని తెలిపారు. సాంప్రదాయ పంటలైన వరి నుండి అధిక లాభాలు వచ్చే పామాయిల్, కూరగాయల సాగు వైపు రైతులు దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా సూచించారు. కలెక్టర్ వెంట డిసిఓ ప్రవీణ్ కుమార్, తహసిల్దార్ కృష్ణయ్య, ఏ డి ఏ జ్ఞానేశ్వరి దేవి, ఏ ఏవో కృష్ణ సందీప్, ఏ ఈ ఓ స్వాతి, పి ఏ సి ఎస్ కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# వికసిత్ భారత్ -2047 లక్ష్యల సాధనలో భాగం కావాలి: జిల్లా ఇంచార్జి జెసి మరియు జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు

వైఎస్ఆర్ కడప, జనవరి 08(భారత శక్తి): వికసిత్ భారత్ -2047 లక్ష్యల సాధనలో భాగం కావాలని జిల్లా ఇంచార్జి జెసి మరియు జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు తెలిపారు. కలెక్టరేట్లోని బోర్డు రూమ్ సమావేశపు మందిరం నందు.. ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్ గార్ యోజన, ఎంప్లాయిస్ ఎన్ రోల్మెంట్ క్యాంపెయిన్ పథకాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.



ఈ సందర్భంగా ఇన్చార్జి జేసి మరియు డిఆర్ఓ మాట్లాడుతూ ...నూతన ఉపాధి కల్పనకు ప్రోత్సాహం, కార్మికుల సామాజిక భద్రత విస్తరణకు ప్రణాళిక రూపొందించడం ఈ పథకాల ఉద్దేశమన్నారు. నూతన పథకాల ద్వారా వివిధ సంస్థల్ని వ్యవస్థీకృత రంగంలోకి తీసుకువచ్చి నిబంధనలు పాటించేలా ప్రోత్సహిస్తామన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, ఆరోగ్య కేంద్రాలు, వాణిజ్య సంస్థలకు అవగాహన కల్పించి భాగస్వాములను చేయించాలన్నారు..ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ద్వారా దేశవ్యాప్తంగా ముఖ్యంగా తయారీ రంగంలో ఉద్యోగాలను పెంచి, సామాజిక భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా కలదనన్నారు.

ఈ కార్యక్రమం లో ఇఎస్ఎఫ్ మేనేజర్ ఉదయ్ భాస్కర్, డైప్యూటీ కమీషనర్ అఫ్ లేబర్ అభిషేక్, ూ××జ జోనల్ మేనేజర్ ప్రమోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నేడు అడవిగన్న ములుగు పాట విడుదల

## - జిల్లా కళాకారుల బృందం

ములుగు జిల్లా ప్రతినిధి, జనవరి 8 (భారత శక్తి): నేడు అడవిగన్న ములుగు పాట విడుదల తో ములుగు జిల్లా చరిత్ర ప్రపంచానికి చాటుతోందని జిల్లా కళాకారుల బృందం తెలిపారు. ఇటీవల మంత్రి సీతక్కతో పాట ట్రెయిలర్ ఆవిష్కరణ చేసిన విషయం తెలిసిందే. అయితే నేడు (శుక్రవారం)న ములుగులోని రామాలయం వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసి అడవిగన్న పాటను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ.. ప్రకృతి పర్యాటకం, విప్లవ చరిత్ర



కలిగిన ములుగు నేపథ్యన్ని గుర్తుచేస్తూ స్థానిక కళాకారులు పాడిన మొట్టమొదటి ములుగు జిల్లా పాట రిలీజ్ ఈవెంట్ను సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. గీత రచయిత గడ్డం శరత్చంద్ర రచించిన ఈ పాటను 8 మంది స్థానిక కళాకారులు పాడగా భరత్ మేకల వినసొంపైన సంగీతం సమకూర్చారన్నారు. తిరుగుబాటు గుణమున్న ములుగు గడ్డమీద ఉన్న కళాభిమానులు అందరూ ఈ పాటను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాసంఘం అధ్యక్షుడు గోల్కొండ బుచ్చన్న, కళాకారులు రాగుల శంకర్, గోల్కొండ బుచ్చన్న, పొలిపాక యాకయ్య, ఎండీ.రహీమోద్దీన్, రేలా కుమార్, మోతె రమేష్, పత్తిపల్లి రాజేందర్, పాట నిర్మాత కోరె అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ మహా శోభాయాత్ర " విజయవంతం చేయండి:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## -ఈ నెల 21 శ్రీ సీతారామ కళ్యాణం, 22న శ్రీరామ మహా శోభాయాత్ర

కడప, జనవరి 8(భారత శక్తి) : విశ్వహిందూ పరిషత్, కడప అయోధ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో కడప నగరంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారామ కళ్యాణం, శ్రీరామ మహా శోభాయాత్ర కార్యక్రమాలను శాంతియుతంగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ నెల 21, 22వ తేదీల్లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కడప నగరంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, శ్రీరామ మహా శోభాయాత్ర నిర్వహణ, శాంతి భద్రతలపై కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి తోకలిసి సంబంధిత అధికారులతో ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమలోనే అంతంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 22న నిర్వహించే శ్రీరామ మహా శోభాయాత్ర కార్యక్రమాన్ని కుల మతాలకు అతీతంగా మాత సామరస్యానికి ప్రతీకగా శాంతియుత వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను, కనీస సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించి ఉత్సవ కమిటీ సభ్యులకు సంబందిత ఏర్పాట్లపై క్షణ్ణంగా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆయా శాఖల అధికారులు సంబంధిత ఏర్పాట్లను నిర్ణీత సమయం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. మహా శోభాయాత్ర నిర్వహించే అన్ని ప్రాంతాల్లో, సెన్సిటీవ్ ఏరియాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి.. మహా శోభాయాత్రను విజయవంతం చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. వేలాది మంది భక్తులు ఈ శోభాయాత్ర లో పాల్గొనడం జరుగుతుందని, అత్యధిక జనాలకు సరిపడా తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు వంటి సదుపాయలను కడప నగరపాలక సంస్థ ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవ శోభాయాత్రలో అతి జాగ్రత్తగా బాణసంచాలు కాల్చేలే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కడప నగరానికి అత్యంత శోభనిచ్చే ఉత్సవం కావడంతో ప్రతి ఒక్కరు మన స్థానిక ఉత్సవంగా భావించి, కులమతాలకు అతీతంగా శాంతియుతంగా, రాజకీయాలకు అతీతంగా, ఆనందదాయకంగా, భక్తి భావంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ కోరారు. కళ్యాణ వేదిక ప్రాంగణంలో విహెచ్ పి బృందం, కమిటీ యాజమాన్యాలు, వలంటీర్లు అధికారుల సహకారంతో.. అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక, కనీస వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. భద్రతా ఏర్పాట్లు, శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, తాగునీరు, భక్తులకు అన్నప్రసాదాలు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ కంట్రోల్, సీసీ కెమెరాలు, విద్యుత్, అగ్నిమాపక వాహనాలు, 108 వాహనాలు, అత్యవసర మందులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, తాత్కాలిక మెడికల్ క్యాంపులు, అక్కడక్కడ హెల్ప్ డెస్క్ ల ఏర్పాటు మొదలైన అన్ని అంశాలను ఎలాంటి కొరత లేకుండా.. ఏర్పాటు చేయాలని సంబందిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి మాట్లాడుతూ కళ్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ప్రత్యేక విద్యుత్ దీప అలంకరణతో అర్చిలు ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీరామ శోభయాత్ర శ్రీరామ, హనుమంతుని భక్తితో కూడిన కడప గడపలో భజన బృందాలు, కోలాట కోలాహలం, బజరంగి విన్యాసాలు, కేరళ వాయిద్యం, రాజస్థానీ యువకుల డబ్బు దరువులు వంటి ఎన్నో సాంస్కృతి కార్యక్రమాలతో సాగుతుందని.. అందుకోసం విద్యుత్ దీపాలంకరణ తో పాటు.. అత్యంత పటిష్ట చర్యలను కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా విద్యుదీకరణ, తోరణాలు, పుష్పాలంకరణ, స్వాగత ఆర్చిలు, ఎల్ఇడి బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. డిఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతూ గతంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం, మహా శోభాయాత్ర ఉత్సవాల అనుభవాలను గుర్తుంచుకొని ఎక్కడా, ఎలాంటి చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా ఈ ఏడాది కూడా శోభాయాత్రను విజయవంతం చేసేందుకు పోలీసు యంత్రాంగం నుండి సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, ఆర్డీవో జాన్ ఇర్విన్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు శ్రీనివాసులు రెడ్డి, వీహెచ్ పి జిల్లా అధ్యక్షులు నందారపు చెన్నకృష్ణారెడ్డి, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డిఎంహెచ్ఓ డా.నాగరాజు, ఏపిఎస్పిడిసిఎల్, డీపీఓ, పంచాయతీ రాజ్ సంబందిత శాఖల అధికారులు, విహెచ్ పి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం, మంత్రికి కృష్ణ జలాల పై అవగాహన లేదు: తలసాని

సికింద్రాబాద్.. జనవరి 8,(భారత శక్తి ప్రతినిధి)

కృష్ణా జలాల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కు అవగాహన లేదనే విషయం స్పష్టమైందని సనత్ నగర్ ఎమ్మెల్యే, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలుగుదేశం నాయకులే రేవంత్ రెడ్డి చెప్పిన మాటలన్నీ అబద్ధమని చెప్పడంతో వీళ్ళ అవగాహన రాహిత్యం బట్టబయలైందని తెలిపారు. కృష్ణా జిల్లాల విషయంలో హరీష్ రావు పి పి టి ద్వారా ప్రజలకు స్పష్టత ఇచ్చారని వెల్లడించారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ చేయాల్సిందేనని మాజీ మంత్రి తలసాని డిమాండ్ చేశారు. చారిత్రక నేపథ్యం ఉన్న సికింద్రాబాద్ పేరు కనుమరుగు చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి దమ్ముంటే హైదరాబాద్ పేరు మార్చాలని అన్నారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామని బంద్ లు, రాస్తారోకోలు, రైలు రోకోలు చేసి సికింద్రాబాద్ కార్పొరేషన్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం కలిసి వచ్చే అన్ని పార్టీ లను కలుపుకొని ఈనెల 11న సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా చేశారని దుయ్యబట్టారు.

# అభివృద్ధి కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలి.: జిల్లా ఇంచార్జి జేసీ, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప, జనవరి 8 (భారత శక్తి): జిల్లాలో అన్ని శాఖలకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఇంచార్జి జేసీ, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు.



గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి సానుకూల ప్రజా దృక్పథం, పీఆర్‌డిఆర్‌డి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్, పంచాయతీ సేవలు, సివిల్ సప్లైస్ – దీపం, ఆర్‌డబి – ఏపీఎస్ఆర్టీసీ (బస్ సర్వీసులు ఁ బస్ స్టేషన్లు), రెవెన్యూ – రిజిస్ట్రేషన్ సేవలు, నీటిపారుదల – నీటిపారుదల నీటి సరఫరా, జీఎస్‌డబ్ల్యూఎస్ – జీఎస్‌డబ్ల్యూఎస్ సేవలు, వైఏటీసీ – (1) ఎకో టూరిజం సేవలు (2) ఎస్ఏఏపీ సేవలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూమ్ ద్వారా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరవ్వగా.. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి ఇంచార్జి జిల్లా జేసీ, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు.

సిఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో డిఆర్వో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలతో పాటు ప్రధానంగా పారదర్శకంగా పిజిఆర్ఎస్ అమలు, సజావుగా గ్యాస్ సరఫరా చర్యలు, ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణీకులకు సంతృప్తికరమైన సేవలు అందించడం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో అన్ని రంగాల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిపై ప్రతి వారం ప్రగతి నివేదికలను జిల్లా కలెక్టర్ కు అందజేయాలన్నారు.

అలాగే ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులపై దృష్టి, మాధకద్రవ్యాల నిరోధం, గ్రామవార్డు సచివాలయాల్లో సేవల మెరుగు.. తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై క్రమం తప్పకుండా మీటింగ్స్ నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో సీపీవో హజరతయ్య, డిఆర్డీఏ పీడి రాజ్యాలక్ష్మి, డిపివో రాజ్యలక్ష్మి, మార్కెటింగ్ ఎడి పరిమళ జ్యోతి, సంబందిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీలు ఐక్యతను చాటాలి.

## –అటవీ కార్యాలయ ముట్టడికి సిద్ధం కావాలి

## – పిలుపునిచ్చిన రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ

మణుగూరు, జనవరి 08, భారతశక్తి:

ఆదివాసీలకు కన్నతల్లి లాంటి అడవిని వక్రమార్గంలో నరికి అక్రమానికి రాజమార్గం వేసిన అటవీ అధికారులకు బుద్ధి చెప్పేందుకు ఆదివాసీలు ఐక్యతతో అటవీ కార్యాలయ ముట్టడికి సిద్ధం కావాలని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ పిలుపునిచ్చారు. గురువారం అంబేద్కర్ సెంటర్లలో గల రేణుక చౌదరి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.



పోడు భూముల విషయంలో ఆదివాసులను ముప్పుతిప్పలు పెట్టి, ఆదివాసులు ఏర్పాటు చేసిన నివాసాలను తొలగించి అవి తమ భూములు అంటూ... వేదాలు వల్లించి అనేక ఇబ్బందులకు గురి చేసి అమాయకులను మానసిక క్షోభకు గురి చేసే అటవీ అధికారుల దౌర్జన్యంపై అటవీ కార్యాలయం ముట్టడికి వేలాదిగా ఆదివాసీలు తరలి రావాలని పిలుపునిచ్చారు. గుట్టమల్లారం అటవీ భూమి లో వేలాది వృక్షాలు నరికి ఫోర్ లైన్ రోడ్లు వేసి భారీగా ముడుపులు తీసుకున్న అటవీ అధికారులు ప్రాణం కన్నా ఎక్కువ అటవి నీ ప్రేమించే ఆదివాసులకు, ఏజెన్సీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరి మెప్పు కోసం అటవీ అధికారులు వేలాది చెట్లు నరికి రోడ్డు నిర్మించారని ప్రశ్నించారు. ఇసుక ర్యాంప్ నిర్వహణ కు అటవీ అధికారులు రహదారులు నిర్మించి ఇసుక మాఫియా కు మేలు చేకూర్చాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వెన్నెల జలపాతం వద్ద పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించకుండానే ప్రజలకు పెద్దగా తెలియని స్వప్న జలపాతానికి దారి అంటూ ప్రజలను పక్కదారి పట్టించి ఏజెన్సీ నియోజకవర్గంలో అమాయకపు ఆదివాసీ ప్రజలను అటవీ అధికాలు మోసం చేస్తున్నారని ఆరోపించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దృష్టికి ఇష్టానుసారంగా అడవి నరికి ఇసుకసురులకు రోడ్డును పరిచిన వైనంపై, 30 ఎకరాల ఫారెస్ట్ భూమికి పట్టా చేసిన వైనంపై ఫిర్యాదు చేస్తామని, అనంతరం ఆదివాసీల ఐక్యతతో ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఖాళీ భూములను నిరుపేద గిరిజనులకు పంచే వరకు శ్రమిస్తామని తెలిపారు.

# ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలి.

మణుగూరు, జనవరి 08 (భారతశక్తి): ఆదివాసీలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని సిఐ నాగబాబు కోరారు. గురువారం బడుగుల గ్రామంలో వలస ఆదివాసీలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వారితో మాట్లాడారు. ఏజెన్సీ పరిధిలో పిల్లలు చదువుకునేలాగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే ఈయువత చేడు వ్యసనాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలని తెలిపారు. మావోయిస్టులకు అనుమానిత వ్యక్తులకు సహాయ సహకారాలు అందించవద్దని సూచించారు. ఇలాంటి వారు ఎవరైనా తారస పడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# జిల్లాలో సరిపోను యూరియా నిల్వలు ఉన్నాయి

## –రైతులెవరు అధైర్యపడాల్సిన అవసరం లేదు

## –జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారతశక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 8:

సూర్యాపేట జిల్లాలో రైతులందరికీ సరిపోయిన ఎరువులు యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్ అన్నారు. గురువారం సూర్యాపేట మండలం పిల్లలమర్రి పిఏసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల గోదామును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్, ఈ పాస్ మిషన్ లను పరిశీలించారు.ఇప్పటివరకు పిల్లలమర్రి పిఏసిఎస్ ద్వారా 290.43 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకి పంపిణి చేశామని ప్రస్తుతం 11.90 మెట్రిక్ టన్నుల (266 బస్తాలు ) యూరియా నిల్వలు ఉన్నాయని ఇంకో 100 మెట్రిక్ టన్నుల యూరియా అయితే ఈ యాసంగి సీజన్ కు సరిపోతుందని శుక్రవారం సాయంత్రం నాటికి మరో రెండు లారీల యూరియా లోడ్లు వస్తుందని ఏ డి ఏ కలెక్టర్ కు వివరించగా ఎంత యూరియా అవసరం ఉంటే అంత సరఫరా చేస్తామని ఈ సందర్బంగా కలెక్టర్ తెలిపారు.అనంతరం కలెక్టర్ అక్కడే ఉన్న రైతులతో మాట్లాడుతూ ఎరువులు మంచిగా సరఫరా చేస్తున్నారా? ఒక ఎకరం వరి పంట ద్వారా ఎంత ఖర్చవుతుంది, ఎంత దిగుబడి వస్తుందని అడగగా 25 వేల వరకు ఖర్చు



అవుతుందని, 33 వేలు మిగులుతాయని తెలిపారు.సాంప్రదాయ వంటలైన వరి నుండి అధిక లాభాలు వచ్చే పామాయిల్,కూరగాయల సాగు వైపు రైతులు దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా సూచించారు.కలెక్టర్ వెంట డిసిఓ ప్రవీణ్ కుమార్, తహసిల్దార్ కృష్ణయ్య, ఏ డి ఏ జ్ఞానేశ్వరి దేవి, ఏ ఏవో కృష్ణ సందీప్,ఏ ఈ ఓ స్వాతి, పి ఏ సి ఎస్ కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి,తదితరులు ఉన్నారు.

# ఎర్దనూరు చౌడమ్మ జాతరలో పాల్గొన్న జగ్గారెడ్డి

## - చౌడమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జగ్గారెడ్డి

## - చౌడమ్మ తల్లికి సంబంధించిన విశేషాల గురించి ఒగ్గు కళాకారులు పాడిన పాటలు విన్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 08:

సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎర్దనూరు గ్రామంలో జరిగిన శ్రీ చౌడమ్మ తల్లి జాతర ఉత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. చౌడమ్మ తల్లి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడమ్మ తల్లి చరిత్ర గురించిన విశేషాలను వివరిస్తూ, ఒగ్గు కళాకారులు పాడిన పాటలను విన్నారు. ఎర్దనూరు గుట్టపైన కొలువైన దేవతామూర్తులను దర్శించుకున్నారు. చౌడమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి జూలకంటి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రఘుగౌడ్, ఎర్దనూరు సర్పంచ్ పంబళ్ల జ్యోతి



దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్ నాశనం అవుతుంది

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి- ఫర్విన్ కౌసర్

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 8 :

బాల్యవివాహాల వల్ల బాలికల జీవితాలు చిన్నవయసులోనే దుర్భరమవుతున్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పర్వీన్ కౌసర్ అన్నారు.గురువారం సూర్యాపేట పట్టణ కేంద్రలోని ఆర్ టి సి బస్టాండ్ ప్రాంగణంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య విహహ్ ముక్త్ అభియాన్



కార్యక్రమం కు ముఖ్య అతిధిగా ఆమె పాల్గొని మాట్లాడారు.18 సంవత్సరాలు నిండని బాలికలు, 21 సంవత్సరాలు నిండని బాలుర వివాహాలు చట్టవిరుద్ధమని, అటువంటి వివాహాలు నిర్వహించిన వారిపై బాల్య వివాహాల నిరోధక చట్టంఉ2006 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని,

బాల్య వివాహాల వల్ల బాలికల విద్యకు ఆటంకం కలుగుతుందని, ఆరోగ్య సమస్యలు, మాతృ మరణాలు, శిశు మరణాలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు.ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి రజిత గోపుమాట్లాడుతూ బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్‌లైన్ 1098, పోలీస్ స్టేషన్ 100, లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, గ్రామాలలో బాల్య వివాహలను అరికట్టెందుకు గ్రామ సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రజలకు అవగాహన కల్పించి బాల్య వివాహాలను నివారించాలని తెలిపారు.ఫస్ట్ ఎడిషనల్ జూనియర్ జడ్జి అపూర్వ రవళి మాట్లాడుతూ బాలికలను చదివించి ఉన్నత స్థానాలకు చేరేంత వరకు వివాహం చేయకూడదని సూచించారు.సెకండ్ ఎడిషనల్ జూనియర్ జడ్జి మంచాల మమతా మాట్లాడుతూ 18 సం ల లోపు ఆడపిల్లలకు వివాహం చేస్తే 2 సం ల శిక్ష, 1 లక్ష రూపాయలు జరిమానా విధించటం జరుగుతుందని ప్రతి ఒక్కరు చట్టాలను గౌరవించాలని కోరారు.

ఆర్టీసీ డి ఎం సునీత బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించారు.

అంతకుముందు బాలసదన్ విద్యార్థినిలచే ఆర్థిక స్తొమత లేక ముగ్గురు ఆడపిల్లల తల్లి పెద్ద అమ్మాయి కి బాల్య వివాహం చేయటం ఆ వివాహాన్ని అధికారులు అడ్డుకోని ఆమెను బాల సదన్ లో చేర్పించి జాబ్ వచ్చేంత వరకు ప్రభుత్వమే చదివిస్తుందని ప్రదర్శించిన నాటకం అందరిని ఆకట్టుకుంది.ఈ కార్యక్రమం లో డి. ఎల్. ఎస్. ఎ నామినేటెడ్ మెంబర్స్ గుంటూరు మధు గారు, నల్లపాటి మమత ,డిప్యూ టీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే.ప్రియదర్శిని, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నా రు.

# వ్యాపారస్తులు లైసెన్స్ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.:ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్

భద్రాచలం, జనవరి 08 (భారతశక్తి): భద్రాచలం పరిసర




ప్రాంతాలలో పెద్ద స్థాయి నుంచి చిన్న స్థాయి వ్యాపారం చేసుకుంటున్న ప్రతి ఒక్కరూ వ్యాపారాన్ని బట్టి లైసెన్స్ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. గురువారం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో ఐటీడీఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో భద్రాచలం, పరిసర ప్రాంతాలలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారస్తులకు లైసెన్స్ రిజిస్ట్రేషన్ మేళ కార్యక్రమానికి ఆయన హాజరై వ్యాపారస్తులకు లైసెన్స్ రిజిస్ట్రేషన్ కాపీలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలో అన్ని ఆహార వస్తువులు అమ్మకాలు చేసుకుంటున్నా వ్యాపారస్తులు, రెస్టారెంట్ నుండి మొదలుకొని బేకరీస్, ఫుడ్ స్టాల్స్, టిఫిన్ సెంటర్లు, చిన్న బడ్డీ కోట్లు, పానీ పూరి సెంటర్లు, కూరగాయల వ్యాపారస్తులు అందరూ తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని, చిన్న వ్యాపారులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ విధంగా చేసుకున్న వ్యాపారస్తులకు వారు వ్యాపారం చేసుకోవడానికి అనుమతి లభించినట్లేనని, ఎఫ్ఎస్ఎస్ఐ ద్వారా ఫుడ్ సేఫ్టీ అథారిటీ లైసెన్స్ మంజూరు అవుతుందని తెలిపారు. వ్యాపారస్తులు రిజిస్ట్రేషన్, లైసెన్సు కలిగిన వారికి వ్యక్తిగతంగా రుణాలు పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేసుకుంటే సేఫ్టీ ఆఫీసర్లు మీరు తయారు చేస్తున్న ఆహార పదార్థాలు తనిఖీ చేసినప్పుడు తప్పనిసరిగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అందుకు ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని, లైసెన్సులు పూర్తికాగానే డైరెక్ట్ గా మీ ఫోన్ కు మెసేజ్ వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్, సిబ్బంది వివిధ వ్యాపారానికి సంబంధించిన యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా గిరిజన సంక్షేమ నాల్గవ తరగతి ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్, జనవరి 08 (భారత శక్తి):

నిర్మల్ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘానికి సంబంధించిన క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల అభివృద్ధిలో నాల్గవ తరగతి ఉద్యోగుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. ఉద్యోగులు తమ విధులను నిబద్ధతతో నిర్వహిస్తూ శాఖ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం గౌరవ



అధ్యక్షులు కెబిసి నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కోల వసంత్, కోశాధికారి రమేష్‌తో పాటు శ్రీకాంత్, రాజశేఖర్, సుభాష్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు క్షేత్ర స్థాయిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 08 (భారత శక్తి):నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామం లోని సదర్మట్ బ్యారేజి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ×రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి. విచ్చేయనున్న నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల కలిసి భద్రత ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో పాటు, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్ , నీటి పారుదల శాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సై అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# బైంసా టౌన్ ఎస్‌హెచ్‌వోగా సాయికుమార్ బాధ్యతలు స్వీకరణ




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 08 (భారత శక్తి): నిర్మల్ జిల్లా బైంసా పట్టణ పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్‌హెచ్‌వోగా ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీసీఆర్‌బీ (ఆఅఖీః) నిర్మల్‌లో విధులు నిర్వహించిన ఆయనను ఇటీవల బైంసా టౌన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు.

ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేయడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు.పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# గ్రామీణ క్రీడాకారులలో ప్రతిభను వెలికి తీసి వారిని మరింత ప్రోత్సహించాలి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 08: గ్రామీణ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో గ్రామపంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా స్థాయిలో చీఫ్ మినిస్టర్ కప్ -2025-26 స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్, కామారెడ్డి అనుమతిలో జిల్లా యువజన,



క్రీడల శాఖ అధ్వర్యంలో సి.యం.కప్-2025-26 టార్చ్ ర్యాలీ గురువారం రోజున స్థలం జడ్ పి హెచ్ ఎస్ బాయ్స్ హై స్కూల్ నుండి ఇందిరాగాంధీ స్టేడియం, కామారెడ్డి వరకు ఉదయం. 10.00 గం,,ల కు శ్రీయుత జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్ బి) శ్రీ. మధుమోహన్ గారు జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీ మద్ది చంద్రకాంత్ రెడ్డి వచ్చ జెండా ఊపి టార్చ్ ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుండి మొదలుకొని నిజాంసా చౌరస్తా - మున్సిపల్ ఆఫీస్ - న్యూ బస్టాండ్ - గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ మీదుగా ఇందిరాగాంధీ స్టేడియంలో ర్యాలీ ముగించడం కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా శ్రీయుత జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్ బి) మాట్లాడుతూ, క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి చేర్చేందుకు 2028 లో జరగనున్న ఒలింపిక్ క్రీడలలో మరిన్ని పథకాలు సాధించేందుకు గ్రామాల నుంచి పట్టణం వరకు యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ, సి.యం.కప్-2025-26 లో యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ముఖ్యమంత్రి కప్ - 2025 యొక్క 2వ ఎడిషన్ లో తమ ప్రతిభ ను కనబరచాలని కోరారు క్రీడల వల్ల మానసిక ఉల్లాసం మెరుగుపడుతుందని తెలియజేశారు.

గ్రామపంచాయతీ స్థాయి జనవరి 17 నుండి 22 వరకు గ్రామపంచాయతీ స్థాయి ఆటలు, జనవరి 28 నుండి 31 వరకు మండల, మునిసిపల్ స్థాయి, 2026 ఫిబ్రవరి 03వ నుండి 07వ వరకు అసెంబ్లీ నియోజకవర్గం స్థాయి, ఫిబ్రవరి 10వ నుండి 14వ వరకు జిల్లా స్థాయి క్రీడలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర స్థాయికి కామారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహించే ఉత్తమ జట్టును ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర స్థాయి ఎంపికలు 19వ ఫిబ్రవరి 2026 నుండి 26వ ఫిబ్రవరి 2026 వరకు జరుగుతాయి.

ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధు మోహన్, కామారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీ మద్ది చంద్రకాంత్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ. రాజు, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి, సెక్రెటరీ కే.పి అనిల్ కుమార్, హాకీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నీలం లింగం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ హీరా లాల్, పేట.టి.యస్ సెక్రెటరీ శ్రీ నోముల మధుసూదన్ రెడ్డి, టి.జి పేట ప్రెసిడెంట్ శ్రీ స్వామి గౌడ్, టిఎన్ జిఓ అధ్యక్షుడు శ్రీ. వెంకట్ రెడ్డి బి.సి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీ. నిల నాగరాజు వివిధ క్రీడ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, యువతి యువకులు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, కాలేజీ, పాఠశాల విద్యార్థులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని సి.యం.కప్-2025 టార్చ్ ర్యాలీ ని విజయవంతం చేశారని జిల్లా యువజన, క్రీడా అధికారి శ్రీ.రంగ వెంకటేశ్వర్ గౌడ్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

# జిల్లా కేంద్రంలోని ఈవియం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 08: ప్రతి నెల నిర్వహించే తనిఖీల్లో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లా కేంద్రంలోని ఈవియం గోదాంను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు.

ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, తహసిల్దార్ జనార్ధన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పెదవి-అంగిలీ చీలిక బాధితులకు ఉచిత శస్త్ర చికిత్సలు







ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 08 (భారత శక్తి). నిర్మల్ . భైంసాలో నీ శిశు మంజూరులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. మరియు. ఇంకెన్నో ఉచిత శిబిరాలు పెడతామని.తెలిపారు..పెదవి మరియు అంగిలీ చీలికతో బాధపడుతున్న చిన్నారులు, బాధితులకు ఎ.బి.యం.ఎస్సెన్ (ంఃఓూా) ఆర్గనైజేషన్ సహకారంతో ంఖీ హాస్పిటల్లో ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు.

హబ్సిగూడ, స్ట్రీట్ నెంబర్?8లోని ంఖీ హాస్పిటల్‌లో ఈ ఉచిత శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అవసరమైనవారు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా హాస్పిటల్‌లోని నోరు, ముఖ మరియు దవడ ఎముకల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ ఎ. విజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 350 నుండి 400 వరకు మూడు నెలల వయస్సు పిల్లల నుంచే పెదవి?అంగిలీ చీలికకు ఉచిత ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వివరాలు మరియు నమోదు కోసం ఆసక్తి గల వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. మేనేజ్మెంట్ అఫ్రోజ్సెల్: 98488 35583 ను సంప్రదించాలన్నారు.

# గీతంలో సంక్రాంతి సంబరాలు

## సంప్రదాయాల సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రదర్శించిన విద్యార్థులు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 8:

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం సంక్రాంతి సంబరాలను ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు. మన దేశ గొప్ప వ్యవసాయ వారసత్వాన్ని ఈ వేడుకలు ప్రతిబింబించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల సంక్రాంతి సంప్రదాయాల సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రదర్శించాయి. మొత్తంమీద పంటల వేడుక యొక్క రంగులు,



సంప్రదాయాలు పండుగ స్ఫూర్తిని సజీవంగా నిలిపాయి.పలు విభాగాల విద్యార్థులు, అధ్యాపకుల మధ్య ఐక్యత, సామరస్యాన్ని సూచిస్తూ భోగి మంటలను వెలిగించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. గొబ్బెమ్మలతో అలంకరించిన సాంప్రదాయ రంగోలి (ముగ్గు) డిజైన్లు, గాలిపటాలు ఎగురవేయడం, సంప్రదాయ దుస్తులలో విద్యార్థులు చేసిన ఆకర్షణీయమైన జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ప్రాంగణమంతా ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదేశంగా మారింది. ఈ వేడుకలలో ముఖ్యాంశాలలో ఒకటి, వ్యవసాయంలో రైతుకు అండదండలుగా నిలిచే పశువుల పట్ల కృతజ్ఞతను సూచించే తెలుగు రాష్ట్రాల విలక్షణమైన సంక్రాంతి ఆచారమైన సాంప్రదాయ గంగిరెద్దులు, పండుగ శోభను మరింత ఇనుమడింపజేశాయి. నేటి యువతకు పురాతన పంటల సంప్రదాయాలను పరిచయం చేయడానికి గాను ఎడ్ల బండి సవారీలు కూడా నిర్వహించారు.అరటి ఆకులపై వడ్డించే సాంప్రదాయ బంతి భోజనం, దీనికి అదనంగా చెరుకు రసం ఈ వేడుకలలో కీలక ఆకర్షణగా నిలిచాయి. గీతంలోని ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్.. ఇలా అన్ని విభాగాల విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొని, పండుగ అనుభవాన్ని మరుపురాని జ్ఞాపకంగా పదిలం చేసుకున్నారు.తెలుగు సంస్కృతి సారాన్ని ప్రతిబింబించే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఉల్లాసభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రాంగణ వాతావరణాన్ని ఉత్సాహభరితంగా మార్చాయి.సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి, సమగ్ర ప్రాంగణ వాతావరణాన్ని ప్రోత్సహించడంలో గీతం యొక్క నిబద్ధతను ఈ వేడుకలు పునరుద్ఘాటించాయి. ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టరేట్ పర్యవేక్షణలో, విద్యార్థి క్లబ్ అన్వేషణ ఈ సంక్రాంతి సంబరాలను నిర్వహించింది.

# సినిమా

## ‘జననాయకన్’ విడుదల వాయిదా



భారీ అంచనాల మధ్య రేపు థియేటర్లలో విడుదల కావాల్సిన దళపతి విజయ్ నటించిన ‘జననాయకన్’ చిత్రం భారత్‌లో వాయిదా పడింది. విడుదలకు కేవలం రెండు రోజుల ముందే ఈ నిర్ణయాన్ని నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అధికారికంగా ప్రకటించింది. ఎక్స్ వేదికగా విడుదల చేసిన ప్రకటనలో, తమ నియంత్రణకు బయట ఉన్న అనివార్య పరిస్థితుల కారణంగానే సినిమాను వాయిదా వేయాల్సి వచ్చిందని నిర్మాణ సంస్థ స్పష్టం చేసింది. ఈ చిత్రంపై ప్రేక్షకులు, అభిమానులు చూపిస్తున్న ఉత్కంఠ, ఆశలు, భావోద్వేగాలను తాము పూర్తిగా అర్థం చేసుకుంటున్నామని, అయినప్పటికీ ఈ నిర్ణయం తీసుకోవడం తమకు కూడా ఎంతో బాధాకరమైందని కేవీఎన్ ప్రొడక్షన్స్ పేర్కొంది. ‘జననాయకన్’ కొత్త విడుదల తేదీని అత్యంత త్వరలో ప్రకటిస్తామని హామీ ఇచ్చిన నిర్మాతలు, అప్పటివరకు ప్రేక్షకులు సహనం పాటించి తమపై ప్రేమను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అభిమానుల అచంచల మద్దతే చిత్రబృందానికి అతిపెద్ద బలమని కూడా ప్రకటనలో పేర్కొన్నారు. అకస్మాత్తుగా వచ్చిన ఈ వాయిదాతో విజయ్ అభిమానుల్లో నిరాశ నెలకొనగా, కొత్త విడుదల తేదీపై ఆసక్తి మరింత పెరిగింది.

## కత్రినా కుమారుడు.. విహాన్!





మల్లీశ్వరి సినిమాలో వెంకటేశ్ సరసన నటించిన భామ కత్రినా కైఫ్. బాలీవుడ్ సినిమాల్లో నటిస్తూ బిజీగా మారిపోయిన ఈ అమ్మడు. హీరో విక్కీ కౌశల్‌తో లవ్‌లో పడింది. ఈ జంట 2021 డిసెంబర్ 9న పెళ్లిపీటలెక్కారు. ఇక వీరి ప్రేమకు గుర్తుగా గతేడాది ఒక పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది కత్రినా. తమ కుమారుడి ఫొటోలు, వీడియోలు బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్న ఈ జంట ఎట్టకేలకు తాజాగా తన కుమారుడిని పరిచయం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా కొడుకు ఫొటోతో పాటు, పేరును కూడా రివీల్ చేస్తూ పోస్ట్ పెట్టింది కత్రినా. ఇక పోస్టులో కత్రినా, విక్కీ కౌశల్‌ల చేతిలో తమ కుమారుడి చేయి ఉన్న ఫొటోని షేర్ చేశారు. అలాగే ‘మా కాంతి కిరణం.. విహాన్ కౌశల్.. మేము చేసిన ప్రార్థనలకు జవాబు దొరికింది. ఇప్పుడు మా జీవితం చాలా అందంగా ఉంది. ఒక్క క్షణంలో ఈ ప్రపంచం మొత్తం మారిపోయింది’ అని కత్రినా ఎమోషనల్ క్యాప్షన్ జోడించింది. ఈ ఫొటో ఇప్పుడు ఇన్‌స్టాలో వైరల్‌గా మారింది. అందరూ బెస్ట్ ఆఫ్ లక్ అని చెబుతున్నారు.

## చిరుకు జోడీగా ఐశ్వర్య?



మెగాస్టార్ చిరంజీవి సరసన ప్రపంచ సుందరి ఐశ్వర్య రాయ్ నటించబోతోందనే టాక్ వినిపిస్తోంది. ఈ సంక్రాంతికి చిరంజీవి హీరోగా నటించిన మన శంకర వరప్రసాద్ గారు’ విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ మూవీ తర్వాత తన 158 వ చిత్రాన్ని పట్టాలెక్కించబోతున్నారని తెలుస్తోంది. ‘వాల్తేరు వీరయ్య’ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత దర్శకుడు బాబీ కొల్లితో చిరు చేస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో చిరుకి జోడిగా చాలా మంది హీరోయిన్ ల పేర్లు వినపడ్డాయి. అయితే ఇప్పుడు మాత్రం ఐశ్వర్యరాయ్ హీరోయిన్ గా నటించబోతోందనే టాక్ వచ్చింది. ఈ వార్త సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ సినిమా కేవలం క్యాస్టింగ్ పరంగానే కాకుండా టెక్నికల్ గానూ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందించబోతున్నారని టాక్. అలాగే మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్ చేయనున్నారట. కోల్‌కతా బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఒక రస్టిక్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా బాబీ ఈ కథను సిద్ధం చేసిన ఈ సినిమా షూటింగ్ మార్చి 2026 నుంచి రెగ్యులర్ జరిగే చాన్స్ ఉందంటున్నారు.

## అనిల్ కథ సిద్ధం చేస్తే వెంకీతో మరో సినిమా

*** ‘మన శంకరవరప్రసాద్‌గారు’ వేడుకలో చిరంజీవి**

‘‘చిత్ర పరిశ్రమలో నిర్మాతలు మొదలుకొని... బయ్యర్ల వరకూ అందరూ సుభిక్షంగా ఉండటమే నిజమైన సంక్రాంతి. 2026 సంక్రాంతి తెలుగు చిత్ర పరిశ్రమ మరిచిపోనంత ఘనంగా ఉండాలని కోరుకుంటున్నా’’ అన్నారు చిరంజీవి. ఈ సంక్రాంతి మా సినిమాది మాత్రమే కాదనీ, మన తెలుగు చిత్ర పరిశ్రమది కావాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన ‘మన శంకరవరప్రసాద్‌గారు’ విడుదలకు ముందస్తు వేడుక బుధవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి, వెంకటేశ్ కలిసి నటించిన చిత్రమిది. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. వేడుకకు చిరంజీవి, వెంకటేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిరంజీవి మాట్లాడుతూ ‘‘నాకు ఆప్తుడైన వెంకటేశ్‌తో కలిసి ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సంక్రాంతికి వస్తున్న సినిమాలన్నీ పక్కాగా పండగ సినిమాలే. అన్ని సినిమాల్నీ థియేటర్లలో చూసి ఆస్వాదించండి. చాలా రోజుల కిందట ప్రముఖ



దర్శకుడు కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ అనిల్ రావిపూడి దర్శకత్వంలో మీరు సినిమా చేస్తే బాగుంటుందని నాతో అన్నారు. ఆయన అన్నట్టుగానే గతేడాది ఆరంభంలో ఆయన చేతులమీదుగానే ఈ సినిమా ప్రారంభమైంది. ఆయన కెరీర్‌లో ఘన విజయం సాధించిన ‘ఘరానా మొగుడు’ తరహాలో మంచి కామెడీతో ఈ సినిమా కథ కుదిరింది.

## అమెజాన్‌లో శోభితా కొత్త సినిమా..
### * స్ట్రీమింగ్ ఎప్పుడంటే!




దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ ప్రాజెక్టులు చేస్తూ తన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి శోభితా ధూళిపాళ్ల. ఆమె ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం ‘చీకటిలో’. తాజాగా ఈ సినిమా స్ట్రీమింగ్ వివరాలను అమెజాన్ ప్రైమ్ ప్రకటించింది. జనవరి 23 నుంచి అందుబాటులో ఉండనున్నట్లు తెలిపింది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఇది స్ట్రీమింగ్ కానున్నట్లు వెల్లడించింది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రానున్న ఈ చిత్రానికి శరత్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించారు. ‘చీకట్లు కమ్ముకునే ముందే సంధ్య వచ్చేస్తుంది.. సిద్ధంగా ఉండండి’ అని పంచుకున్న పోస్టర్ ఆసక్తికరంగా ఉంది.

## టాప్‌లో సారా అర్జున్.. ప్రభాస్, విజయ్‌లను బీట్ చేసిన నటి



‘ధురంధర్’తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు నటి సారా అర్జున్. ఈ సినిమా రిలీజైన నాటి నుంచి ట్రెండింగ్‌లో ఉన్న ఆమె తాజాగా అరుదైన ఘనతను సాధించారు. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ.. తాజాగా ఈ వారంలో ఎక్కువ ప్రజాదరణ పొందిన ఇండియన్ సెలబ్రిటీల జాబితాను విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో సారా అర్జున్ అగ్ర హీరోలను బీట్ చేసి టాప్ వన్‌లో నిలిచారు. ఒకవైపు బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తూ.. చరిత్రను తిరగరాస్తుండడంతో సారా అర్జున్‌కు ప్రేక్షకుల్లో విపరీతమైన ఆదరణ సొంతమవుతోంది. దీంతో అగ్ర తారలు ప్రభాస్, విజయ్‌లను వెనక్కినెట్టి ఆమె నంబర్ వన్ స్థానానికి చేరారు. ఈ లిస్ట్‌లో కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ 8లో ఉండగా.. ప్రభాస్ 19లో ఉన్నారు. అగస్త్య నంద 12లో, భాగ్యశ్రీ బోర్సే 15వ స్థానంలో నిలిచారు. ‘ధురంధర్’లో రణ్‌వీర్‌కు జోడీగా యాలినా జమాలిగా ఆమె ఆకట్టుకున్నారు. బాల నటిగా గుర్తింపు సొంతం చేసుకున్న ఆమె.. ఈ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నటుడు రాకేశ్ బేడీ ఆమెను ముద్దుపెట్టుకోవడం కూడా తీవ్ర చర్చనీయాంశమైంది. తండ్రి తన కుమార్తెను ముద్దుపెట్టుకున్నట్లు సారాను ఆప్యాయంగా పలకరించానని ఆయన తర్వాత స్పష్టతనిచ్చిన విషయం తెలిసిందే.

## ‘టాక్సిక్’ సర్‌ప్రైజ్ వచ్చేసింది.. ‘రాయ’గా రాక్‌స్టార్!



‘కేజీయఫ్’ చిత్రాల తర్వాత యశ్ నటిస్తోన్న సినిమా ‘టాక్సిక్’. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. ‘ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్’ అనేది ఉప శీర్షిక. నేడు ఈ రాక్‌స్టార్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం సర్‌ప్రైజ్ ఇచ్చింది. యశ్ లుక్‌ను విడుదల చేస్తూ గ్లింప్స్‌ను రిలీజ్ చేసింది. ఇందులో యశ్ రాయ పాత్రలో నటిస్తున్నట్లు తెలుపుతూ పవర్‌ఫుల్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ వ్యక్తి చాలా ప్రమాదకరం అంటూ పాత్రను పరిచయం చేస్తూ వీడియోను షేర్ చేసింది . అయితే అందులో హింసతో పాటు మసాలా సీన్స్ కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతుండగా అభిమానులు యశ్ లుక్ పోస్టర్‌ను షేర్ చేస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇక ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications , D.No.42/51-3,